
ఆంధ్రమహిళ

సాంఘికాభ్యుదయ మాస పత్రిక



విశ్వకవి. విశ్వశాంతి పిపాసువతడు.
నటన చిత్రలేఖనం విజ్ఞాని యతడు,
అతను 'నోబెల్' బహుమానాన్ని పొందినతడు
కోవిదుడు. రవీంద్రనాథఠాగూరతడు॥

VOL : XVII ANDHRA MAHILA JUNE 1961 No. 6

విషయసూచిక

1.	సంపాదకీయము - ఆంధ్రప్రదేశ శిశు సంక్షేమసంఘస్థితి	...	1
2.	రవీంద్రుని ప్రార్థనగీతాలు - శ్రీ వే. వేం. కృ.	...	3
3.	మొగలిజడ - శ్రీమతి కే. సీతాదేవి.	...	4
4.	కంకణ విక్రేతలు - శ్రీ మ. దొరస్వామి.	...	5
5.	పట్టుదల - "ఉష"	...	6
6.	గతస్మృతులు - శ్రీ సాయినాథశాస్త్రి.	...	9
7.	గృహదహనం - శ్రీ పవని నిర్మలప్రభావతి.	...	13
8.	మనోహరసత్యం - శ్రీమతి వై. లీలాసీతారాం.	...	16
9.	మహిళావిద్యాభివృద్ధి.	...	17
10.	ఆంధ్రమహిళాసభ—బర్కత్పుర—హైదరాబాదు.	...	19
11.	సాహితీసుందరి - శ్రీ "సాధుశ్రీ"	...	20
12.	చక్రవర్తిపదవి పొందిన బెస్తవాడు.	...	21
13.	"రాధ" - శ్రీ "సారథి"	...	27
14.	బామ్మగారూ—బూడిదగుమ్మడికాయలూ - శ్రీమతి పవని నిర్మలప్రభావతి	...	29
15.	జీవిక - శ్రీ యామిజాల నరసింహమూర్తి.	...	33
16.	వార్తావళి.	...	35
17.	గ్రంథసమీక్ష.	...	36

చందాదారుల కొరక విన్నపము

'ఆంధ్రమహిళ'— పోషకవర్గానికి చెందిన చందాదారులు మేమెన్నిజాబులు వ్రాసినా, తాము చెల్లింపవలసిన చందాలు చెల్లింపకుండటమేకాక, జవాబులయినా వ్రాయకపోవటం విచారకరం. అట్టిమహిళయులు ఎప్పటి మోస్తరుగా మహిళకు తమ చందాలను వెంటనేపంపి పోషింపవలెనని అభ్యర్థిస్తున్నాము.

రచయితలకు మనవి.

'ఆంధ్రమహిళ' - కు ప్రచురణార్థం వ్యాసాలుసంపే రచయితలు, అరతావు కాగితాలలో—విడివిడిగా చక్కనివ్రాతతో ఒక్కప్రక్కమాత్రమే వ్రాసిపంపాలి. చేతికివచ్చినట్లు జిలుగువ్రాతతో పంపే వ్యాసాలు అంగీకరింపబడవు. పంపినవ్యాసాలు తిరిగి పాఠసుపంపబడవు. కాన రచయితలు ఒక ప్రతి ముందుగానే వ్రాసి భద్రపఱచుకోవటం మంచిది.

ఇట్లు:— మేనేజరు,

ఆంధ్రమహిళ.

ఆంధ్రమహిళ

వ్యవస్థాపకురాలు : దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపుటి 17 :: జూన్, 1961 :: సంచిక 6

ఆంధ్రప్రదేశ శిశు సంక్షేమ సంఘ స్థితి

ఐక్యభారత శిశుసంక్షేమ సంఘాధ్యక్షురాలయిన శ్రీమతి ఇందిరాగాంధి ఇటీవల కొన్నాళ్లక్రిందట హైదరాబాదుకు వచ్చినపుడు ఇలా చెప్పింది:—"ఆంధ్రప్రదేశ శిశుసంక్షేమసమితి బిడ్డ పుట్టినప్పటినుంచి 11 ఏండ్లవరకు సర్వవిధాలా సముచితమయిన సంక్షేమస్థితియందు పెంపొందటానికై ఆదర్శంగా ఉండదగిన ఒక గొప్పపథకాన్ని నిర్మించ నిశ్చయించినందుకు చాలాసంతోషిస్తున్నాను. ఆపథకంలోని సూత్రాలప్రకారం కార్యక్రమం నడపటానికి తగినప్రదేశంగా, 22,000 జనాభాగల పఠాన్ చెర్వు అనేగ్రామాన్ని ఎన్నుకున్నారు. ఆగ్రామంలో 2 ఏండ్లలోపు ఈడుగల బిడ్డలు 1,905 మంది, 2 ఏండ్లనుంచి ఆరేండ్లలోపు వయస్సుగలవారు 3,380 మంది, 6 ఏండ్లనుంచి 11 ఏండ్లప్రాయంవారు 3,230 మంది గలరు. ప్రభుత్వానికి సంబంధించిన,-వైద్య ఆరోగ్య, విద్యా, సంక్షేమశాఖలు శిశువుల అభ్యుదయానికై పనిచేసే సంఘంతో సహకరిస్తున్నవని—ఆంధ్రప్రదేశ ఆరోగ్య వైద్యశాఖామాత్యునివల్ల తెలియవస్తున్నది. ప్రభుత్వంతో ఎలాటి సంబంధం లేకుండా, స్వయంగా ఈవిషయంలో పనిచేసేసంస్థలు,—అనగా, భారతీయ శిశు సంక్షేమసమితి, భారతీయ సాంఘికాభ్యుదయసమాజం, హైదరాబాదు మహిళా శిశు చికిత్సా సహాయసంస్థ— ఇవి ఇట్టి అభ్యుదయ కార్యాలకు ప్రభుత్వం పూనుకొన్నపుడు, దానికి తోడ్పడుతున్నవి. శిశుసంక్షేమానికయి యేర్పడ్డ ఈ ఆదర్శపథకంలోని కార్యాల్ని మూడేండ్లవరకు ఆచరణలో పెట్టి పరిశీలించాల్నని ప్రభుత్వం తీర్మానించుకొన్నది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇందుకై కేంద్రప్రభుత్వాజ్ఞను నిరీక్షిస్తున్నది." శ్రీమతి ఇందిరాగాంధి పైన వెల్లడించిన విషయాల్నిబట్టి భావిభారతపౌరులు కాదగిన ఈనాటి శిశువుల పెంపకానికి కేవలం కన్నవారిమీద నే ఆధారపడటం అంతసముచితంగా కనిపించదు. మరీ గ్రామీణులయిన పిల్లలవిషయం చాలావరకూ శోచనీయావస్థలోనే ఉందని పరిశీలించేవారికి బాగా మనస్సుకు రాగలదు. సభ్యత, సంస్కృతి గల నగరవాసుల బిడ్డలే చక్కనిశిక్షణ లేని కారణంచేత భావిజీవిత పథాన్ని మలుచుకొని సక్రమపద్ధతులకు అలవాటుపడనపుడు పల్లెపట్లలో వసించేవారినిగూర్చి మనం అనుకోవటంలో లాభంలేదు. కాన, బిడ్డల శిక్షణ విషయంలో సర్వేసర్వత్ర ఒకేపథకాన్ని అనుసరించలేము. పైగా, శిశువులవిషయమై, వారితండ్రులుమాత్రమే శ్రద్ధవహించటం చాలదు. ప్రభుత్వంకూడ

అంతకు ఇరుమిక్కిలిగా శ్రద్ధవహించాలి. శ్రీమతి గాంధి చెప్పినట్లు శిశుసంక్షేమార్థమై సంస్థలు నడిపే సంఘాలన్నీ కూడా పరస్పర సహకారంతో నిరంతరం పాటుపడాలి.

భారతదేశం సంఘుసంక్షేమకర కార్యాలలో ముందంజవేసి ఆబాలవృద్ధం (హీనస్థితిలో ఉండేవారిని) పైకి తేవటానికి పూనుకొన్ననాడే దేశం ఏకోన్ముఖంగా, సాంఘిక సామ్యవ్యవస్థ ఏర్పడటానికి అనుకూలంగా వెలయగలదు. తక్కినదేశాలతోబాటు అన్నిరంగాలలోను వృద్ధికి రాగలదు. అన్యజాతులతో తులతూగగలదు.

మనకు స్వతంత్రం లభించినతరువాత—మనవిషయంలో సానుభూతిగల జాతుల పరపతిని పూర్తిగ పొందగలిగాము. ఈపదేండ్లలో అలాటి రాజ్యాల ఆర్థికసహాయంవల్ల పంచవర్ష ప్రణాళికలను అనుసరించి దేశంలో సాంఘికంగా, సాంకేతికంగా, సంపత్సమృద్ధికరంగా కార్యాలు నడుపుకొంటున్నాము. కాని, ఈపదియేండ్ల అభివృద్ధి ఇతరదేశాల అభివృద్ధితో పోల్చిచూచు కొన్నప్పుడు చాలా స్వల్పమయిందనే చెప్పాలి. పైగా బాహిరంగా కనబడే అభివృద్ధి చిత్తశుద్ధితో కూడిందికాదు. కుల మత వ్యక్తిగతాభిమానాలు అణగారిపోనంతవరకు, స్వార్థం, దుబారా, లంచగొండితనం నశించనంతవరకు, ధనవంతులు, దరిద్రులు, మధ్యస్థితివారు అనీ, గొప్పవారు కొలదివారు అనీ విభేదాలతో సతమతం కావటం రూపుమాసేంతవరకు—మన సాంఘికవాదాలు-సామ్యవాదాలు - కేవలం అరణ్యరోదనాలుగా పరిణమిస్తాయి.

ఇంతకూ చెప్పవచ్చిందేమిటంటే, యీతరంవారు గడించిన దేశస్వాతంత్ర్యాన్ని పూర్తిగా పోషించటానికి కంకణం కట్టుకోవలసినవారు వెనుకటితరంవారు. కనుక వారి చక్కని నడవడికకు తగినపునాది లిపుడే పడాలి. అందుకు తగిన తరిబీతు ఇపుడే యియ్యాలి. ఒకనాడు దేశస్వాతంత్ర్యంకొరకు పోరాడిన యీతరంవారు కేవలం స్వార్థపరులై, పదవులపైననో, పర్మిట్లపైననో, లైసెన్సులపైననో తమదృష్టులను మళ్లించటం దేశదౌర్భాగ్యం.

జాతీయతాస్ఫూర్తికి దోహదంగా, రష్యా, అమెరికా, ఇంగ్లండు దేశాలలోని ప్రజలు ప్రభుత్వాలను ఎదురుచూడక, వారిజోక్యమే ఉంచుకోక స్వచ్ఛందంగా పెక్కుసంస్థలను స్థాపించి నిర్వహిస్తూ ఉండటం స్వయంగా చూచివచ్చిన మనదేశంలో పెద్దలు "దేశం ఎల్లాపోతే మనకేం, జాతి యెల్లా నశిస్తే మనకేం" అనేధోరణిలో ప్రవర్తించేవరకు వారికి అభ్యుదయమార్గం కనిపించదు. 'మనదేశం' 'మనజాతి' అనే భావన మన యీతరంవారు మరచిపోయినా, వచ్చేతరం వారికైనా అలాటి అభిమానం పుట్టుకొచ్చే పంథాలో మన భారత బాలబాలికలను మనం పెంచాలి.

మన శిశువులకు చిన్నతనంలోనే స్వయంకృషి, ఋజుప్రవర్తనం, క్రమశిక్షణ అలవడాలి. నీతి, నిజాయితీ, కష్టసహనం, ధైర్యస్థైర్యాలు మొదలయిన గుణాలు ఏర్పడాలి. సోదరమానవ ప్రేమ, లోకకల్యాణకాంక్ష, పీడితజాతులమీది సానుభూతి, అన్యదేశీయులయెడ సుహృద్భావం వాడుకపడాలి. కనుక ఈనాటి శిశువులను మనం అలక్ష్యంగా చూడరాదు. వారికి అచంచలం అయిన ఉత్సాహాన్ని కలిగించే క్రీడలు, దేహసౌష్ఠవాన్ని చేకూర్చే ఆరోగ్యవిధానాలు, చురుకుదనంతో విజ్ఞానాన్ని ఆర్జించగల తేలిక విద్యాకార్యక్రమాలు చాలా అవసరం. ఈవిషయాన్ని గుర్తించి

నేటి ప్రభుత్వం తమ అభిప్రాయంమేరకు తల్లిగర్భంనుండి బయటపడిన బిడ్డలను 11 ఏండ్ల యీడు వచ్చేవరకు తమ బాధ్యతతో తరిబీతు చేయాలి. వారి పోషణరక్షణాదికాలు తాము నెరవేర్చవలసిన విధ్యుక్తధర్మం అని విశ్వసించాలి. నిఱుపేదలయిన పిల్లలకు ఉడుపులకు, ఆహారవిహారాలకు అనుకూలాలు కల్పించాలి. శిశువులపెంపకంలో అనుసరింపదగు మార్గాలను ఒక్క పట్టాణ చెర్వు గ్రామంలోనే గాక, భారత దేశ రాష్ట్రాల గ్రామాలన్నింటిలోను ప్రచారం చెయ్యాలి. గ్రామ వాసులు తామె స్వయంగా ఈశిశు సంక్షేమ కార్యాలకు ఉత్సాహంతో సహకరించేలాగున ప్రోత్సహించాలి. ఆంధ్రప్రదేశ ప్రభుత్వారోగ్యమంత్రి శ్రీమతి గాంధితో కేవలం వాచాకైంకర్యంగా శిశుసంక్షేమ సమితి కార్యాలను ఏకరువుపెట్టినంతమాత్రాన ప్రయోజనంలేదు. చెప్పినంతవరకైనా చేసి చూపటం యుక్తం. పైగా ఆయన భావికాలంలో చేయదలచుకొన్న కార్యాల పథకాన్ని గురించి ఉగ్గడించాడే; కాని యింతవరకు ఆంధ్రప్రభుత్వం ఈవిషయంలో చేసిందేమిటో చెప్పక కప్పదాటు వేశాడు. మొత్తంమీద తక్కిన కొన్ని రాష్ట్రాలకంటె, ఆంధ్రప్రదేశంలో శిశు సంక్షేమ సమితి తృప్తికరంగా పనిచేయలేదనే విషయంమాత్రం నిశ్చయం. ఇకనైనా శ్రద్ధతో బాలబాలికల భావ్యభివృద్ధివిషయంలో ప్రభుత్వం ప్రజ పరస్పరం సహకారం చూపుతూ, ఏకోన్ముఖంగా పనిచేయాల్సిన అవసరాన్ని గమనించటం భావ్యం. తక్కిన అన్ని ప్రాజెక్టులకంటె దీనికే ప్రాధాన్యమిచ్చేయెడల పురోభివృద్ధి కది గొప్ప సూచకం కాగలదని దృఢంగా చెప్పగలము. అలాంటిభాగ్యం త్వరలో సిద్ధించునని మావిశ్వాసం.

రవీంద్రుని ప్రార్థన గీతాలు

మూలం: శ్రీ రవీంద్ర కవి - అనువాదం: వే. వేం. కృ.

ఎచట భయమ్ములే కెడఁద శోభించునో,
  ఎచట మస్తకము పైకెత్తనగునో
ఎచట సంకుచితము లెల్లభావపుఁ గుడ్య
  ముల జగంబగలి వ్యాకులము గనదొ,
ఎచట నగాధ సూనృతమునుండి ప్రపంచ
  మురువడి వెలువడి యుల్లసిలునో,
ఎచట విరామ మొక్కింత లేనిప్రయత్న
  ములకు బాహులు చాచి వెలయనగునో,
ఎచట సహేతుక మను తేటనీటిచా
  లెండుశెడారుల యెడకుఁ జనదొ.
ఎచట విస్తృతభావ నిచయకృత్యావళి
  కడకేగు మనసును నడుపఁగలమొ,
అట్టి స్వేచ్ఛాప్రదేశమౌ నమృతలోక
  మునకు జేరువచోటి కెప్పుడు మదీయ
దేశ మెంతయు జేరున ట్లీపు కరుణ
  మేలుకొలుపుము, నాతండ్రి, మేలుకొలుపు॥

నా మనోదారిద్ర్యమూలము
  నడఁచివేయుము, అడఁచివేయుము
నాదు సుఖదుఃఖముల నోర్చెడు
  బలము నాకొక్కింత యొసఁగుము
సఫలసేవకుఁ బ్రియము చూపెడు
  బలము నాకొక్కింత యొసఁగుము
దీనజనములఁ జేరఁదీసెడు
  బలము నాకొక్కింత యొసఁగుము
గర్వికడ నే మోకరింపని
  బలము నాకొక్కింత యొసఁగుము
నీదు నిచ్చకు లోఁగి నడచెడు
  బలము నాకొక్కింత యొసఁగుము॥

మొగలి జడ

శ్రీమతి కె. సీతాదేవి

విరిశాయి మల్లెలు-పూశాయి మొల్లలు
లెక్కలేనన్నిపూలు
తొగరువాసనల గుబాళించాయి నడిరేయి
కొసరి కొసరీ కొసరి కూసింది కోకిలా
వాసంతమరుదెంచె వనభూమి నవ్వింది
కావ్యగానముచేసె శ్రావ్యమ్ముగాను
పక్షుల కిలకిల ధ్వనులు పరిమళమ్ములతోను
మాఘాదిపంచకము మంచి ముహూర్తాలు
కన్నెలమనసులు కలకలమనంగ
ఒకకన్నె కోరింది ఒక చిన్నికోర్కె
చిత్రశిల్పాలన్ని చేజేతగలవాని
భావుకుండగు సుధాభాసురాంగుండని
తనకు సరిసరి యనగ తలచె నాకన్నె
తళుకుబెళుకులుగలతరుణి యది గాదు
వజ్రవైఢూర్యాల గమకింపులే లేదు
ముత్తియము పోలింది మురిపెంపు పెంపులో
గ్రామీణయౌ ముగ్ధ తలచెనా యెడదలో
హంససందేశంబు వినిన దమయంతివలె
రూపగుణప్రేమమున నతనినే గోరె
కన్నతండ్రికి కాళ్ల బలపాలు కట్టాక
రుక్మిణీసతివోలె గురునిపంపింది
ఆదర్శపురుషుండు అతడు తా వత్తునని
ఇత్తునని తనమనసు నికపైన నామెకు
కబురుతెలిసినతోడ తోడికన్నియలు
ఎగతాళిచేయగా దొడగిరెంతెంతొ
పూర్ణిమాచంద్రుని కోరె నీరమణి యని
యతనికెందరో తారలున్నారు చుట్టి యని
ఆటగా పట్టించియు నామె నగ్గించిరి
అతడువచ్చునని ఎదురెదురు చూసింది ఎంతొ
పనసమామిడిమొదలు ఫలములతోగూడ కాని
అతడు రాలేదు
గ్రీష్మాతపంబరుదెంచె వడగాడ్పులువీచె
సొక్కిసొక్కిసొక్కి సొలెనాకన్నె
వనిత వసివాడినది వన్నె తిరిగినది
అంతలో నరుదెంచె శ్రావణాభ్రములు
భూమియంతయు సస్యశ్యామలం బయిపోయె
సొగసుసొగసుల ప్రకృతి సౌందర్యసంపదా
వింతచీకట్లతో వింతవెలుగులతోడ
శారదాచంద్రికలు మించాయి రేల
సరసుల మనసుల కలకలు తీర
విరిశాయి కలువలు వింతఅందముతోడ
కొలనినిండుగ పూలపరపులై తోచె
నిండుపున్నమ వెలుగులో అంతయు తెల్లగా
వెన్నెలా నిండింది వింతయందమ్ముతో
అతనిదర్శించె నామె యాశరజ్జ్యోత్స్నలో
చల్లనౌ తెల్లనౌ స్వచ్ఛహృదయమువాని
తనదుకోర్కెల కాకారమైనవాని
కనులలో కౌశలము కన్పించువాని
ఎంచిహృదయమున నుంచుకొన్నది పదిలముగ
ఋతువులొక్కొక్కటే సాగినవి మెల్లిగా
బంతిచామంతి మొదలు పూవులతోడ
వాసంతమరుదెంచె వనభూములందు
ఎల్లెడల చిరునవ్వు చిగిరించగాను
అతడు వచ్చియు తన్ను చేకొందునని పలికె
ఎదురుతెన్నులు చూచి నిలిచిపోయినది
వాడిపోయినమొక్క తీవమాదిరిగ
గ్రీష్మాతపంబుకు తోడు అతను రాలేదు
శ్రావణంబరుదెంచె శ్రామికులకింపుగా
పూచాయి వెలగలు పువ్వులతో నిండుగా
చెంగలువపూలు తమచేతులెత్తి పిలిచె
శ్రావణాభ్రముల విరిసెజూకామల్లె
నిండుతేనియలతో తేనెటీగలకు తమ
తేనెలను విందుగా
మొగలిపువ్వులుపూచి మొగమొత్తె వాసనలు
అరుదెంచె నొకకబురు అతనికడనుండి
తన్నెరమ్మని పిలిచె తనను చేపట్టగా
హృదయమ్ము ఒక్కింత భారమైకన్పట్టె
అతనిసహచరిగ నెట్లు జరుగునో యని
కళ్యాణమై యతనికరము ధరించి
ఆయరుంధతికి మ్రొక్కి యాశీర్వదింపుమని
పెద్దలాశీర్వచనమ్ము పెంపొందగాను
అత్త ప్రేమించె నా కొత్తకోడలిని
మొగలిజడకుట్టి నా ముద్దుకోడలికి
అత్తకుట్టిన జడకెంతో మురిసిమురిసి
ముదిత ముసిముసినవ్వు నవ్వుకొనుచుండ
ఓర్వలే కొక్కయింతి యోయమ్మ! యేమి!
మురిసిపోయెదవమ్మ యింతి యీజడకేను
దీనియర్థము తెలికొను మోముద్దరాల

బెనారస్ హిందూవిశ్వవిద్యాలయ అడ్మిషన్ పరీక్షలకు మార్చి 61 లో వెళ్ళిన విద్యార్థిను లలో ఉత్తీర్ణులైనవారు.

మూడవ తరగతి—(*contd.*)

15. కుమారి సురేఖా జయానంద్ కొఠారి 16. కుమారి సరోజా వి. యస్. గిరి 17. కుమారి సాపి ప్రభాగోయల్
18. ,, యస్. ఆర్. స్నేహలత 19. ,, షెయిలా మెహతా 20. ,, యస్. ప్రభావతి
21. ,, గీతా రంగస్వామి 22. ,, టి. యస్. మహేశ్వరి 23. శ్రీమతి ఊర్మిళా పి. పాండ్యా
24 ,, వి. అవు 25. ,, నిర్మలా సెల్వరాజన్ 26. కుమారి జే. ఆషా

(అనుబంధం)

1. కుమారి రాయరోత్ కుట్టాంబళ్లి పుష్ప

ఆంధ్రా మెట్రికుక్ పరీక్షలలో—1961 మార్చిలో ఉత్తీర్ణులయినవారు—(*contd.*)

మూడవ తరగతి

1. కుమారి వి. కృష్ణవేణి 2. కుమారి బి. ఉష

ఎంతవాసనయున్న ఎంతయందము ఉన్న
పున్నవి ముళ్లరేకులే పైన
ఈ పూలరక్షణకు పాములే యుండు
దీని పుప్పొడివంటి ధైర్యమాతనిది
ఈజడ సొంపుకే ఇంతమురిసెదవో
యని యన్నమాటకు చాలు నోవదిన
నీపాదధూళి నా శిరమున నుంతు
ఇంక మాట్లాడకుడు ఇట్టిమాటలును
సచ్ఛీలతా ప్రేమ సేవాదిగుణములను
జగము మెప్పించాలి మొగలివాసనలాగ
అని మనసులో తలచి మాట్లాడకుండినది
వడివడిగ వర్షాలు వెనకపట్టంగానె
వెండిమేఘాలతో వింతవెలుగులతోడ
శారదారాత్రులే శాంతముగతోచె
శారదానవరాత్ర సంభ్రమంబులకు
చొక్కినది యాసతి తనవరుని తలచి
ఎంచి తనహృదయాన ఎపుడుచేర్చునో యని
విజయమౌ దినమున దశమిచంద్రికలోన
అతని నువెగ్లులా విరిసె ఉత్పలములు
ఆహ్వానమది యేదో వీణానినాదమును
మృదుమధుర మురళీనినాదమును బోలింది
మరి రాగరంజితము నీరవంబై యుండి

శక్తిపూరము ఆమె నాచికొన్నది హృదిని
ఫలియించె జీవనఫలమె ఆనాడు
విరిసింది హృదయముల పుష్పమానాడు
హేమంతమున కళాజ్యోత్స్నలే వెలిగాయి
ఆ కళాశిలికై సంతరించినవన్ని
చక్కనివి ముగ్గులూ, చక్కనివి శిల్పాలు
అతనికొరకై యంత అర్పితమయాయి
వింతపువ్వులరంగు లెంతయో మెరిశాయి
హేమంతశిశిర హిమబిందు ముక్తావళులతో
తలపులతరంగాల తరుణి మరచింది
ఉడికెడియన్నంబు ఒకపొంగుపొంగి
చేతనముకలిగించె చేతిమీదనుపడి
అంతఆలోచించి యేమిచేయుటకో
యని యత్త స్వగతంబు విన్పించి కొంత
మరికొంత చేతనము కలిగింది యామెకు
కనులు వర్షించినవి శ్రావణాంబువులు
మనసు ఘోషించె మరి యామె యన్నమాటకును
కన్నెతలపులకింత జరిగినది రభస
ఇది నిత్యజీవితము దీనిదరి వేరు
భావుకత్వము కళా కావ్య ప్రేమలన్నియును
నిర్జీవమైపోయి నిలుచు నీబాట॥

కంకణ విక్రేతలు

శ్రీమతి సరోజినిదేవి బేంగల్ సెల్లర్సునకు స్వేచ్ఛానుకృతి

శ్రీ విద్వాన్ మధురాంతకం దొరస్వామి

దివ్య దేదీప్య సౌందర్య కాంతిపుంజ
మంజులంబులు గాజులు మగువలుగొన
ఇంద్రధనువును బోలిన వింపు దాల్చి
సంత కేతేరు బేహారి సముదయంబు.

రజిత శ్యామల వర్ణంపు రాణగూర్చు
కంకణావళిపై గూర్మి కన్నెలకగు
నిగ్గుదేరెడి తామర మొగ్గలట్టి
కంకణావళిపై గూర్మి కాంతలకగు.

భాస్కరుని యెండవేడిలో ప్రభలుగుల్కి
పండి వంగిన వరిపంట వంటి సొగసు
గుల్కు గాజులు నెలతలు కూర్మి గొండ్రు
పరిణయంబున హోమాగ్ని ప్రజ్వరిల్లు
వన్నియలు గూడ నెన్నదు రన్న నేమి?
హృదయ కుహరాన యొదవిన మృదులభావ
పరిణితికి తగ్గ గాజులు పరిణయంపు
సుందరాంగుల పాలిటి సొమ్ము గాదె!

కొందఱు కోమలాంగులను కోరికలూరు పసిండిచాయలన్
బొందుకొనంగ జాలినవి పచ్చని బూదిని వన్నెచిన్నెలన్
జాదులవన్నెయున్ గలుగు చానలదెంతయు గూర్మి గొండ్రుగా
మోదముతో సభర్తృకత మోహనరూపుని కృష్ణుగొల్చుచోన్.

పట్టుదల

"ఉష"

"అమ్మా! పోస్టు!"

మంచంమీద పడుకుని పేపరుచదువుతున్న విద్యుత్ ఛంగున లేచింది. ఆతురత, ఆనందం, భయం ఒక్క సారిగా ఆవరించిన ముఖంతో, గబగబ కవరు చించింది. 'అబ్బ! ఆఖరికి!...'అనుకుంటూ వుత్తరాన్ని హృదయానికి హత్తుకుంది, కానీ ఎలాగ? ఏంచేయటం?... తన ఆనందాన్ని పంచుకునేదెవరు? సలహా యిచ్చేదెవరు?.... ఈ ఆలోచనలు కలగటంతోటే విద్యుత్ గుండె బరువెక్కింది. కానీ మరుక్షణం ధైర్యాన్నంతా కూడదీసుకుని, తండ్రిగదిని సమీపించింది.

• • •

విద్యుత్‌కి 21 సంవత్సరాలు. ఆమెతండ్రి వెటర్నరీ ఆఫీసరు. ఇటీవలే రిటైర్ అయాడు. విద్యుత్‌కి చిన్నచెల్లాయిలు, తమ్ముళ్లు యింకా నలుగురు వున్నారు. విద్యుత్‌కి ముందు యిద్దరు పిల్లలు పుట్టి పోవటంతో తల్లితండ్రులు ఆమెని అల్లారుముద్దుగా పెంచారు. ఒరిస్సా విశ్వవిద్యాలయంలో విద్యుత్ బి. ఏ. పూర్తిచేసింది. సంవత్సరంగా యింట్లోనే వుంటూంది. తల్లితండ్రులు ఆమెకి పెళ్లిప్రయత్నాలు చాలాజోరుగా సాగిస్తున్నారు. మంచిసంబంధం ఒకటి స్థిరపడిపోయే సూచనలు దగ్గిరపడుతున్నాయి. కానీ విద్యుత్ తనభవిష్యత్తుగూర్చి పెంచుకుంటున్న ఆశలు, చేస్తున్న ప్రయత్నాలు వారికి తెలియదు. ఇంట్లో ఒక్కప్రాణికి తెలియకుండా, విద్యుత్ ముఖ్యసేవిక వుద్యోగానికి దరఖాస్తు పెట్టింది. ఇంటర్వ్యూకికూడా వెళ్లివచ్చింది. రెండుమూడు వారాలుగా, ఆర్డరు కోసం తహతహలాడిపోతూంది. చూసిచూసి యిక నిరాశచెందింది. ఆశ అప్పుడప్పుడూ మనసులో పొడ సూపుతున్నా, కాదేమోననే భయం, వస్తే ఎదుర్కోవలసిన పరిస్థితులు ఆమెని కలవరపెడుతూనే వున్నాయి...

• • •

సనాతన ఆచారాలకీ, భావాలకీ యింకా విలువ యిచ్చి, వాటిని తు. చ. తప్పకుండా ఆచరిస్తుంటారు యిప్పటికీ ఒరిస్సావాసులు. ఆడపిల్లల్ని ఎంతచదివించినా, వుద్యోగాలకి పంపేందుకు తల్లిదండ్రులు వెనుకంజ వేసేవారు. విద్యుత్ పుట్టినది అలాటి సనాతన కుటుంబంలో. తిండికీ, బట్టకీ కొదవలేక, స్త్రీలని పనికి పంపటం మహాపాపంకింద ఎంచే వ్యక్తులు ఆమె కుటుంబంలోనివారంతా. విద్యుత్ చెప్పినవార్త విని తండ్రి ఆగ్రహపడలేదు. తిట్లు, శాపనార్థాలు పెట్టలేదు. బెదిరింపులతో కేకలు వేయలేదు కన్నీళ్లతో, ఆమె నటువంటి సాహసానికి పూనుకోవద్దని బ్రతిమాలాడు. కానీ విద్యుత్ చేసుకున్న నిర్ణయం చాలా గట్టిదనీ, ఆమె ఆనిర్ణయాన్ని ఏమాత్రం మార్చుకోదనీ అతనికి తెలియదు. త్వరలో కూతుర్ని పెళ్లిపీటల మీద చూడాలని ఉవ్విళ్లూరుతున్న తల్లి, నిశ్చేష్టురాలయి అలా నిలబడిపోయింది.

• • •

విద్యుత్ సామాన్లన్నీ ఒక్కత్తే సర్దుకుంది. చుట్టాలు, స్నేహితులు సలహాలతో, విమర్శలతో చెవిని పోరుతున్నా వినకుండా రైలెక్కింది. ఆమె చిన్నతమ్ముడు మటుకు అక్కగారికి చేయూతనిచ్చి, ప్రోత్సహించాడు.

• • •

పల్లెప్రాంతాలలో ముఖ్యసేవిక చేయవలసినపని చాలాకష్టతరమైంది. శరీరారోగ్యము, ధైర్యము, మనోనిబ్బరం, లోకపరిజ్ఞానం ఈపనికి ఎంతో అవసరమైనవి. పల్లెటూళ్లల్లో గ్రామసేవికపనిని తనిఖీ చేయటం, సి. ఐ. సి. మీటింగులని ఏర్పాటుచేయటం, గ్రామీణుల కనీసఅవసరాలని తీర్చటం, యింటింటికీ వెళ్లి, పల్లెప్రజలని పలకరించి, వారిసౌకర్యాలు చూడటం....ఈవిధంగా ముఖ్యసేవికపనులు బహుముఖమైంది. ఇటు పల్లెప్రజలని, అటు సెంటరు వుద్యోగస్థుల్ని యిరువుర్నీ తృప్తిపరచవలసిన బాధ్యత ఆమెపైనుంది. వయసులో చిన్నదై, జీవితానుభవం, లోకజ్ఞానం యింకా అలవడని విద్యుత్ ఆభారాన్ని మోయలేకపోయింది. పల్లెల్లోని స్త్రీలు ఆమెనుచూసి ముఖం తిప్పేసుకున్నారు, కాస్త వయసుమళ్లినవాళ్లు ఆమెని హేళనచేస్తే, యువతులు తమ వ్యక్తిగతసమస్యల్ని ఆమెతో చర్చించేందుకు వెనుకాడారు. విద్యుత్ ప్రేమతో చెయిజాపితే, పిల్లలు భయంతో వెనక్కి తిరిగారు.

కానీ విద్యుత్ తెలివిగలది. చురుకైనది. చాలా పట్టుదలగలది కూడా, భువనేశ్వర్‌లో అడుగుపెట్టి

నదిమొదలు ఎదురైన పరిస్థితులు ఆమెలో ఏమాత్రం నిరాశని కలుగజేయలేదు. పైపెచ్చు, తన బాధ్యతని గుర్తించేందుకు తోడ్పడింది. ఏకారణంవల్ల ప్రజలు తనని నిరాకరిస్తున్నారో, ఏవిధంగా తను వారిని ఆకర్షించాలో ఆమె అవగాహన చేసుకుంది. ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో, ఎటువంటిపరిస్థితుల్లోనూ జడవక, ఆమె ముందుకి సాగింది.

కొద్దిరోజుల్లోనే విద్యుత్ గ్రామస్థుల స్నేహాన్ని పొందగలిగింది. ముఖ్యంగా ఆదివాసస్త్రీలు ఆమెని 'అమ్మా' "అత్తా", "వియ్యపురాలా!" అని అనేక రకాల పేర్లతో పిలవసాగారు. ఒక్కోపూట ఒక్కో పల్లె తిరిగే విద్యుత్‌కి గ్రామీణుల ఆతిథ్యాన్ని, ప్రేమనీ విడిపించుకుని వెళ్లిపోవటం కష్టతరం కాసాగింది. ఆమెని తమయింట రోజులతరబడి అలా వుండిపొమ్మనీ, వారు పోట్లాడేవారు.

కల్లకపటం తెలియని అమాయకులు గ్రామీణులతో విద్యుత్ రకరకాల అనుభవాలని చవిచూచింది. కొంటెతనం, అల్లరి వెదజల్లే కళ్లతో, కాస్త సిగ్గు పడుతూ ఆమె, గ్రామస్త్రీలు తనని వివాహంపిపయం గురించి ఎలా ప్రాణంతీస్తారో తాను ఎన్ని అసత్యాలు ఆడుతూంటుందో చెప్పింది. "నీకు పెళ్లయిందా? పిల్లా? ఎంతమంది పిల్లలు?" "మనదేవూరు? వారికి వుద్యోగమేమిటి?" ఈప్రశ్న పరంపరల్ని తప్పించు కునేందుకు తాను వివాహితురాలిననే చాలామందితో అబద్ధమాడింది విద్యుత్.

సెంటర్లలో పని సరిగా జరగటంలేదు, చాలా ప్రాంతాలలో సాంఘిక సేవికల పని అసంతృప్తికరంగా వుంది అనే అభియోగాన్ని విద్యుత్ ఏమాత్రం అంగీకరించదు. నిరక్షరాస్యులు, కొన్ని సనాతన ఆచారాలకీ, కట్టుబాట్లకీ లోపడిన పల్లెప్రజల మనస్తత్వం చిత్రంగా వుంటుంది. కొత్తభావాలనీ, అభిప్రాయాలనీ వారు యిట్టే అంగీకరించరు, హర్షించరు. వారి మనసుల్లో పరివర్తన తెచ్చి, సాంఘిక సేవయొక్క విలువని వారికి తెలియజేయడం సామాన్యమైనపని కాదు. దీనికెంతో సహనము, ఆత్మవిశ్వాసము కావాలి. కొన్ని ప్రాంతాల ప్రజలు చురుగ్గా, మనల్ని త్వరగా అర్థంచేసుకోగలుగుతారు. మరికొందరు మొండిగా, మనతో కాస్తంతయినా సహకరించరు. అదే మరికొందరు పెల్లుబికే ఉత్సాహంతో ముందుకి వస్తారు. అందువల్లె ప్రాజెక్టువర్కు కొన్నిచోట్ల విజయవంతంగా సాగుతుంది. కొన్ని ప్రాంతాల ఎన్నాళ్లకీ ఫలితం కనుపించదు. అందుకని, ఒక సెంటరులో పని బాగా సాగనంతమాత్రాన ప్రతిచోటా అలాగే వుంటుందను కోవటం పొరపాటు అంటుంది విద్యుత్.

ఈ పై అభిప్రాయాన్ని వెల్లడిస్తూ విద్యుత్ నాకు ఓచిన్న సంఘటనను వర్ణించింది. ఒకసారి స్టేటు బోర్డు యినస్పెక్టరు ఒకాయన సెంటర్లని తనిఖీచేసేందుకు వెళ్లాడు. ఒకసెంటరులో కుట్టుపని సరిగ్గా జరగటంలేదని ఆయన ముఖం చిటపటలాడింది. ఆ సమయానికి పల్లెస్త్రీలు పొలంలోకి వెళ్లారనీ, పంటల కోతకాలమనీ, ఎంత నచ్చజెప్పినా ఆయన వినిపించుకోలేదు. ఆతరువాత చూసిన రెండుమూడు సెంటర్లూ ఆయనని చాలా నిరుత్సాహపరిచాయి. కానీ విద్యుత్ పట్టు విడవకుండా ఆయన్ని చాలా సెంటర్లకి తీసుకు వెళ్లింది.

చివరికి వారు ఓ వయోజనవిద్యక్లాసుకి చేరు కున్నారు. మిణుకుమిణుకుమంటున్న లాంతరు వెలుగులో, ఓ 20 మంది స్త్రీలు అతిశ్రద్ధగా చదువు కుంటున్నారు. అందులో ఓపాతికేళ్ల ఆదివాసస్త్రీని ఉద్దేశించి, యినస్పెక్టరు యిలా అడిగారు.

"నువ్వెందుకని చదువుకుంటున్నావు?"

"ఎందుకేమిటి? అయ్యోరామ! మీరు ఈప్రశ్న ఎలా అడగగలుగుతున్నారో నాకు ఆశ్చర్యంగా వుంది! అత్తారింట్లో నాబ్రతుకు ఎలావుందో నాన్నకి ఉత్తరాలు రాయాలామరి! నేనూ చదువుకున్న వాళ్లతో మాట్లాడాలా మరి! ఇంతేకాదు సుమండీ! రేపు నా పిల్లల్ని బడికి పంపకుండా ఎంచక్కా నేనే చదువు చెబుతాను" ఆమెసమాధానం విని ఆశ్చర్యపోయాడు యినస్పెక్టరు. పక్కనే నిల్చున్న విద్యుత్ మనసులోని ఆనందాన్ని, గర్వాన్నీ దాచుకోలేకపోయింది.

భువనేశ్వర్‌లో ముఖ్యసేవికగా చేరిన విద్యుత్ రెండుసంవత్సరాల అనంతరం కలకత్తా శాంతినికేతన్‌లో శిక్షణపొందింది. ఆశిక్షణ తనకి ఎంతో అనుభవజ్ఞానాన్ని, యిచ్చిందంటుంది మూడుమాసాల ట్రెయినింగ్‌లో, సాంఘికశాస్త్రము, తాత్విక శాస్త్రము, చరిత్ర, భూగోళశాస్త్రం, పల్లెపర్యటన.... ఈవిధంగా అనేకవాటిల్లో శిక్షణపొందింది ఆమె. ట్రెయినింగు అనంతరం జరిగిన పరీక్షలో, 33 గురిలోనూ ప్రథమంగా ఉత్తీర్ణురాలయింది.

చామనచాయరంగు, చురుకైన కోలకళ్లు, పెద్ద తలకట్టు, సన్నము, పొడవు....విద్యుత్‌కి యిప్పుడు పాతికసంవత్సరాలు. గత నాలుగుసంవత్సరాలుగా ఆమె కోఆర్డినేటెడ్ ప్రాజెక్టులో పనిచేస్తోంది. తన పనియందు తృప్తి. పల్లెప్రజలయెడల అభిమానంగల ఈమెకి ఆత్మవిశ్వాసం, తన పనిని యింకా లోపరహితంగా, సేవాతత్పరతతో చేయాలనే కోరిక వుంది. పట్నవాసపు బెళుకులకంటే పల్లెటూరి జీవితం, ఆ నైర్మల్యం ఈమె యిష్టపడుతుంది. వివాహం చేసుకుందుకు విద్యుత్‌కి అభ్యంతరంలేదు కానీ, ఆర్థిక స్వాతంత్ర్యంలో, కెరియర్‌లో ఈమెకి గాఢవిశ్వాసముంది.

మనదేశం నలుమూలలకీ వ్యాపిస్తూ, ప్రజలకి అఖండ సేవచేస్తున్న సాంఘికసంక్షేమం విజయవంతం అయేందుకు విద్యుత్‌లాంటి చదువుకున్నయువతులు ఎంతో అవసరమనిపించింది నాకు.

ఉషఃకాలమున ఇంకను చీకటియున్నపుడే లేచి రెక్కలు విదుర్చుకొనుపక్షి సూర్యోదయమును సూచించునట్లు నాహృదయము మేల్కొని రాబోవు గొప్పభవిష్యత్తునుగూర్చి పాడుచున్నది. ఆభవిష్యత్తు సమీపించుచున్నది. దానికి స్వాగతమీయ మనము సర్వసిద్ధముగా నుందుముగాక !

(విశ్వకవి: రవీంద్రుడు)

కథానిక :

గత స్మృతులు

శ్రీ సాయినాధశాస్త్రి

మల్లి ఫ్యాక్టరీలోకి నడిచిపోతోంది. చంకలో మూడేళ్ల కుఱ్ఱాడున్నాడు అడుగులు తడబడుతున్నై. అందులో వున్నకూలీల్లో సగంమందికి మల్లి తెలుసు. రోజూ ప్రొద్దున్నే వొచ్చి బియ్యం అడుక్కుంటుంది. ఓనరుగారుంటే ఒక్కగింజకూడా దొరకదు. అందుకని రోజూ వోనరుగారికన్నా ముందుగా మల్లే ఫ్యాక్టరీకెళ్తూంటుంది. ఆవేళ వుదయం రాలేదు. ఎందుకనో? అనుకున్నారు కూలీలంతా. ఆరోజు సాయంత్రం 5 గంటలప్పుడు మల్లి వొచ్చింది. ఓనరుగారు కూలీలమీద కేకవేస్తున్నారు. అందుక్కారణం మరేంలేదు— ఎవరో ఒకకూలీ, వొంట్లో బాగుండక రెండురోజుల్నుంచీ పన్లోకి రావటంలేదని. అదీకోపం! సరిగ్గా అదేసమయానికి మల్లి "ధర్మంచెయ్యండి బాబూ!" అంటూ వొచ్చింది ఆకోపం యీకోపం అంతా మల్లిమీద చూపించారు. "పోపోవే! రోజూ యిదోవేషం! దుక్కలాగావున్నావ్, పనిచేసుకోరాదూ!" అంటూ.

"పనేందొరక్కేగా బాబూ అడుక్కుతినటం" అంది మల్లి.

"సరే! ఇవాల్టికి మా కూలాడొకడు పన్లోకి రాలేదుగానీ, నువ్వుండి ఆపనిచెయ్యి. వాడికూలి రెండున్నర. నీకిష్టమైతే రూపాయిన్నరిస్తా. ఇష్టమైతే వుండు." అన్నారు.

"బాబూ! వారంరోజుల్నుంచీ లేవటంలేదు. నిన్న వుదయంనుంచీ పిల్లాడి కొక్క మెతుగ్గూడా పెట్టలేదు. జరంతో ఎక్కడికీ కదల్లేక పోయాను. ఇప్పుడే కాస్త కళ్లుతెరిచాను. కాస్త ధర్మం చేస్తే రేపో మాపో జరం తగ్గటంతోనే వొచ్చి పనిలో చేరతానండీ!" అంది మల్లి వినయంగా.

"ప్రతివాళ్లకీ జరాలూ, వొంట్లో బాగుండక పోవటాలూను. పోనంలేసరి! అయినా అడుక్కోటం చాతయిందానివి పనిచేస్తావా? పోపో!" అన్నారు వోనరుగారు నిరసనగా.

"బాబూ! యీపూటకింకెక్కడికీ పోలేను. కాసిని బియ్యం పెట్టించండి. మీపేరు చెప్పుకొని పిల్లడూ నేనూ యింత గంజితాగుతాం" అంది మల్లి దీనంగా ప్రార్థిస్తూ.

"బియ్యమా! ఇంకానయం, రెండురూపాయలివ్వండి హోటల్లో భోజనం చేస్తానన్నావు కాదు. వెళ్లువెళ్లు" అన్నారు.

"బాబ్బాబూ! పిల్లాడిప్రాణాలు రక్షించండి బాబూ! మీమేలు మరిచిపోం" అంటూ ప్రాధేయపడుతుంటే—

"పొమ్మని చెబుతుంటే నీక్కాదూ! శనిగ్రహం లాగా పట్టుకుని వొదలవేం! ఒరేయ్! రాఘవులూ! దీన్ని బైటికి గెంటేసి గేట్లు వేశెయ్యి! యిటువంటి వాళ్ల నింకెప్పుడూ లోపలికి రానివ్వకండి. ఎవరూ లేకుండా చూసి ఏమన్నా చేతపట్టుకుపోయినా పోతారు" అని చెప్పి వెళ్లిపోయారు. ఓనరుగారి దయ సంపాదిద్దామనుకునే మనస్తత్వంగల రాఘవులు మల్లినీ, పిల్లణ్ణీ బైటికి తోసేసి గేట్లు వేశేశాడు. ఉసూరుమంటూ మల్లి యివతలికి వొచ్చేసింది. నడవలేక పోతోంది. కళ్లు తిరుగుతున్నై. నీరసంగా, మగతగావుంది. కాసేపెక్కడన్నా పడుకుందామని పిల్లణ్ణి తీసుకుని ఫ్యాక్టరీకీ, ప్రక్కనే వున్న గోడౌనుకీ మధ్యనున్న సందులో కొంగుపరుచుకుని, పిల్లణ్ణి పెట్టుకుని పడుకుంది. తనకర్మ యిట్టాకాలింది. ఎంతగొప్పగా బతికింది తను; చివరకిట్టాగైంది. కళ్లల్లో అపూర్వపుజీవితం అంతా మెదిలింది మసకమసగ్గా—

వీరాచారి ఆవూళ్లోకల్లా పేరుమోసిన వడ్రంగం మేస్త్రీ. మేజిస్ట్రేటుగారి మేజాదగ్గర్నుంచీ పంతులుగారి పడక్కుర్చీదాకా అతనే చెయ్యాలి అతనిగుండా చేయించుకున్నామిది అంటేనే ఘనత. అందుకని ఎప్పుడూ వీరాచారి చేతికింద ఎప్పుడూ పదిమంది పనివాళ్లదాకే వుండేవాళ్లు. వాళ్లకివాల్సిన జీతాలుగాక, ప్రతిరోజూ కాఫీలూ, ఫలహారాలూ పెట్టించేవాడు. డబ్బుకేం లోటులేకుండా దర్జాగా సాగిపోయేది. ఎట్టా వొచ్చేడబ్బు అట్టా ఖర్చు పెట్టేశేవాడు. రేపెట్టాగడుస్తుందా అనే ఆలోచనే వుండేదికాదు. అడిగినవాళ్లకల్లా లేదనకుండా అప్పులిచ్చేవాడు. ఆ అప్పు

తీసుకున్న వాళ్ళే తెచ్చిస్తే తీసుకునేవాడు. అంతేగానీ నోరుతెరిచి అడిగేవాడుకాడు. అట్టా గడిచిపోతూండేవి రోజులు.

వీరాచారికి వరసగా ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారు. వాళ్ళనే కొడుకుల్లాగా చూసుకునేవాడు. మూడోపిల్ల మల్లికాంబ. ఆఖరిపిల్లంటే అంతా పంచప్రాణాలుగా చూసుకునేవాళ్ళు. పెద్దపిల్లల్నిద్దర్నీ వుద్యోగస్థులకిచ్చి పెళ్ళిచేశాడు. మల్లికాంబనికూడా ఏవుద్యోగస్థుడికో ఇచ్చేస్తే బాగానేవుండేది. కానీ అట్టా చెయ్యలా. తనకిందే పనిచేసే వో తెలివైన కుఱ్ఱాణ్ణి చూసి, అతనికిచ్చి పెళ్ళిచేసి అల్లుణ్ణీ కూతుర్నీ తనయింట్లోనేవుంచుకున్నాడు. పెద్దేంది వీరాచారి అల్లుణ్ణి పని ముట్టుకోనిచ్చేవాడుకాడు అల్లుడు నాగాచారికూడా సర్దాగా కాలం గడిపేవాడు. నాగాచారి వీరాచారికి కన్నకొడుక్కన్నా ఎక్కువైనాడు.

ఇట్టా గడిచిపోయినై చాలాయేళ్ళు. వున్నట్టుండి ఓరోజున పని చేస్తూచేస్తూనే వీరాచారి స్పృహ లేకుండా పడిపోయాడు. డాక్టర్లొచ్చారు. మందులూ అవీ యిచ్చారు. ఫలితం లేకపోయింది. వీరాచారి చచ్చిపోయాడు. ఆరోజున పెద్దపెద్దఆఫీసర్లు కూడా వొచ్చి నాగాచారికి సానుభూతి చెప్పిపోయారు. ఆపదిరోజులూ పని ఆగిపోయింది. అంతా విచారంగానే గడిపేశారు.

వీరాచారి మరణంతో ఆయింట్లో వున్న కళాకాంతులూ పోయినై. పనివాళ్ళంతా తలోదారీ చూసుకున్నారు. మామగారు సంపాదించిందేం మిగలకపోవటంమూలాన కుటుంబాన్ని పోషించటానికి నాగాచారికి ఉలీ, బాడిస పట్టక తప్పలేదు పాపం! కొత్తగా మళ్ళీ పనిలోకి దిగటం, అందులో సుఖం మరిగింతరవాత— పనేంచెయ్యలేక పోయేవాడు. వూళ్ళోవాళ్ళుకూడా పనులు చేయించుకోటం మానేశారు. దాంతో పరిస్థితి మరీ దిగజారిపోయింది.

బాగా వున్నరోజుల్లో అలవాటైన కాఫీలూ, ఫలహారాలూమాత్రం వొదల్లేదు. తగ్గించుకోటం కష్టమైపోయింది. ఇట్టావుండగానే నాగాచారికి కొడుకు పుట్టాడు. రోజుకి రూపాయి సంపాదించటమే గగనమైపోయింది. వీరాచారి ఏమీ ఆస్థిఅనేది మిగల్చకపోయినా, గౌరవంగా జీవించటంమూలాన చాలారోజులు అప్పుపుట్టింది. కానీ క్రమేణా ఆ అప్పులుకూడా తలమునిగి తాటిప్రమాణాలైనై. తీర్చటం కష్టమైపోయింది. సంపాదనుంటేగా తీర్చటానికి. అప్పులు తీర్చటం కష్టమై ఉన్నయిల్లుకాస్తా అమ్మేశారు. దాంతో 'నా' అన్నది ఏమీ లేకుండా పోయింది.

పెళ్ళాంబిడ్డల్ని పోషించటంకోసం నాగాచారి రాత్రింబవళ్ళు కష్టపడేవాడు. పగలల్లా కార్ఖానాల్లో పనిచేసేవాడు. రాత్రిపూట యింటిదగ్గర పనిచేసేవాడు. మల్లికాంబకూడా ఏ ఎండకాగొడుగు పట్టటం నేర్చింది చాలావరకు. ఉన్నదాంట్లోనే తినో తినకో గుట్టుగా సంసారాన్ని లాక్కొస్తోంది. ఎన్నికష్టాలు పడుతున్నా అక్కయ్యల్నేమీ చెయ్యిజాపి అడగలేదు. వాళ్ళసలే పట్టించుకోలేదు చెల్లెలివిషయం! తనలాగా రెక్కాడితేగానీ డొక్కాడదనేట్టు కాకుండా, తన కొడుక్కి బాగా చదువుచెప్పించి పెద్దివాణ్ణి చెయ్యాలని నాగాచారి కోరిక. అందుకే శరీరం దాచుకోకుండా కష్టపడేవాడు. అట్టా అట్టా ఒకపాతికరూపాయలు మిగల్చగలిగాడు. కొడుక్కి ఏడాది వెళ్ళి రెండోఏడు వొచ్చింది.

రాత్రింబవళ్ళు ఏకదీక్షగా పనిచేస్తూండేసరికి శరీరం బాగా శుష్కించిపోయింది. అప్పుడప్పుడూ జ్వరంకూడా వొస్తూండేది. అయినా పనిమానేవాడుకాడు. జ్వరం వొచ్చిందని మల్లికాంబక్కూడా చెప్పేవాడుకాడు. పెళ్ళాం మరీ బలవంతంచేస్తే ఆ పూటకిమాత్రం పని ఆపేవాడు. కానీ మనసులో వ్యధ తనకొడుకు ఏమౌతాడోనని.

ఆరోజు రాత్రల్లా పనిచేస్తూనేవున్నాడు. మల్లికాంబకు మెలకువ వొచ్చి. మొగుడు పనిచేస్తూండటం చూసి దగ్గరకెళ్ళి పనిమానిపించి, దీపంతగ్గించి పడుకుంది. ఎప్పుడూ తెల్లారుఝామునే లేచి పనిచేసుకునే అలవాటు గనక లేచి, మొగుణ్ణి లేపుదామని మల్లికాంబమీద చెయ్యివేసింది. ఒళ్ళు కాలిపోతోంది. మల్లికాంబకి గుండె గుభేలుమంది. నెమ్మదిగా పిలిచింది. ఉహూ! పలకలేదు. గబగబా డాక్టరుదగ్గిరికి పరిగెత్తింది. డాక్టరొచ్చి, పరీక్షచేసి ఏవేవో మందులు తెమ్మని చెప్పాడు. కష్టపడి మిగిల్చిన పాతికరూపాయిలూ తీసుకుని బయల్దేరింది, మందులూ అవీ తెచ్చేసరికి పరిస్థితి యింకా గాబరాగా వుంది. మందులు కలిపి గంటగంటకీ డాక్టరు చెప్పినట్టుగానే యిస్తోంది. పిల్లణ్ణిగురించే ఎప్పుడూ కల

వరింతలు. సాయంత్రానికి కళ్లు తెరిచి నెమ్మదిగా "మల్లికా! మల్లికా!" అన్నాడు.

మందులు కలుపుతూన్న మల్లికాంబ వాటితోనే దగ్గిరకొచ్చి "ఏమిటండీ! పిలిచారా?" అంది.

"బాబేడీ?" అనడిగాడు నీరసంగా నాగాచారి.

"అడుగో! ఆమంచంమీద పడుకుని నిద్రపోతున్నాడు. తీసుకురానా?" అంది మల్లికాంబ.

"ఒద్దులే! నేచెప్పేది కొంచెం జాగ్రత్తగావిను" అన్నాడు.

"ముందీమందు తాగండి. తరవాత చెబుదురుగాని" అని మందు నోట్లో పొయ్యబోయింది. నాగాచారి చేత్తోఆపేసి — "బాబుని ఎట్లాగైనా పెద్దచదువు చదివించి, ఆఫీసర్నిగా చేద్దామనుకున్నా. కానీ చెయ్యకుండానే వెళ్లిపోతున్నా. బాబుని జాగ్రత్తగా చూసేభారం నీదే!" అన్నాడు నాగాచారి అతికష్టంమీద. మల్లికాంబ దుఃఖంతో పమిటిచెంగు నోట్లో కుక్కుకుని ఏడుస్తోంది. నాగాచారి మెదల కుండా మందుతాగి పడుకున్నాడు. అంతే, మళ్లీ మాట్లాళ్లేదు. ఆరోజు సాయంత్రానికే నాగాచారి మల్లికాంబనీ, కొడుకునీ వొదిలిపెట్టి వెళ్లిపోయాడు.

మల్లికాంబకు ప్రపంచంఅంతా శూన్యమైపోయింది. బ్రతుకే భారమైపోయింది. ఏం చెయ్యాలి? ఎట్లా బాలుని బతికించుకోవాలి? యివే ఆలోచనలు. మల్లికాంబ అవతారంకూడా మారిపోయింది. ఎప్పుడూ ఏడుస్తూంటుంది. కుఱ్ఱాడు భయంభయంగా తల్లి వంక చూసేవాడు. మొదట్నుంచీ సుఖంగా బతికిన దవటంచేత ఏపనీ చేతకాదు. కూలికెళ్లేది, సిగ్గువిడిచి చేయలేకపోయేది. ఒకటి రెండు రోజులు చూసి ఎవరూ కూలికికూడా పిలిచేవాళ్లు కారు. కష్టపడి పనిచేద్దామనుకుంటే పనిమనిషిగాకూడా పెట్టుకో లేదు. అంట్లు తోమేది. బట్టలుతికేది. నీళ్లుచేర బోసేది. ఎన్నిచేసినా రోజుగడవటమే కష్టంగా వుండేది.

పిల్లడూ, తనూ బతకాలంటే అడుక్కోటంతప్ప గత్యంతరం లేకపోయింది. ఏడాదైంది అడుక్కోటం మొదలుపెట్టి. అడుక్కుంటుంటే ఎందరో ఎన్నో విధాల అంటుంటారు. తప్పదుమరి! తనబాబుని బతికించుకోవాలంటే ఎన్నైనా భరించాల్సిందే! దొరికిన రోజున తిని, లేనిరోజున మానేసి, ఏచెట్టుకిందో వీధి అరుగులమీదనో పడుకుని గడిపేది. ఎన్నికష్టాలు పడ్డా పిల్లడు "అమ్మా!" అని ఒక్కసారంటే తనబాధల్నీ కష్టాల్నీ మరిచిపోయేది. బాబుని పెద్దవాణ్ణి చెయ్యాలనే ఆశతోనే జీవితాన్ని యీడుస్తోంది. కాలమే మల్లికాంబని మల్లిగా మార్చేసింది!

కానీ ఎన్నాళ్లు బతుకుతుంది తనుమాత్రం? తను కూడా చచ్చిపోతే తనబాబుగతేంకావాలి? ఈ ఆలోచన రావటంతోనే దుఃఖం ముంచుకొచ్చింది. గత స్మృతుల నన్నింటినీ వెనక్కునెట్టేసి "బాబూ!" అంది. "అమ్మా!" అంటూ తల్లివేపు తిరిగాడు. మల్లి కొడుకుని గట్టిగా కావిలించుకుంది. అదివరకునించీ జరం వొస్తున్నా తోసుకు తిరుగుతున్న మల్లి మరి మాట్లాళ్లేక పోయింది!!!

తల్లి కదలకపోవటంతో నెమ్మదిగా లేచిన బాబు "అమ్మా! అమ్మా!" అని తట్టి పిలిచాడు. అమ్మ యిక పలకదని ఆపసిహృదయాని కేంతెలుసు? అట్లాగే కాసేపు పిలిచి నెమ్మదిగా తప్పటడుగులేస్తూ అట్లా అట్లా ఆసందు మలుపు తిరిగిపోయాడు బాబు.

"పండితులైనవారలు
 భూస్థలి నుండఁగ నల్పుఁడొక్కఁడు
ద్దండతఁ బీఠ మెక్కిన బు
 ధప్రకరంబుల కేమిలోటగు
గొండొకక్రోఁతి చెట్టుకొన
 కొమ్మకు నెక్కినఁ, గ్రింద మత్తవే
దండ మహోగ్రసింహములు
 తాలిమినుండవె రాజచంద్రమా!"

(పూర్వకవి చాటువు)

గృహదహనం

శ్రీమతి పవని నిర్మలప్రభావతి

ముందుగా ఇద్దరుఆఫీసర్లూ, సర్వేయర్లూ, పనిముట్లు నెత్తినపెట్టుక ఇద్దరుజవాన్లూ, అందరికంటెముందు, వాటర్ బాటిల్ మెడనుతగిలించుక, ఫ్లాస్కు చేతులోపట్టుక ముసలివెంకయ్య నడుస్తున్నారు. చెరువుగట్టు సన్నగా వుంటంవల్ల వరుసగ మెల్లగా నడుస్తున్నారంతా! ఉన్నట్టుండి ఉస్సురంటూ కూలబడ్డాడు వెంకయ్య! అందరూ తక్కన ఆగిపోయారు—ఇంజను బ్రేకు వేస్తే, దభీమని నిలిచే రైలుపెట్టెల్లా!

"ఏమయిందోయ్!" అన్నాడు నౌఖరు మల్లన్న.

"ఇక నడవలేను బాబూ! కాళ్లు లాగేస్తున్నాయ్!" మెడలోని వాటర్ బాటిల్ పక్కనపెట్టి కాళ్లురెండూ జాపుక కూచున్నాడు వెంకయ్య!

"ఎక్కడ పట్టాగయ్యా? చచ్చుపీనుగని?" ఇంజనీరు పళ్లు పటపటలాడించాడు. నీళ్లు నమిలాడు అసిస్టెంటు.

"దోవ చూపిస్తాననీ. సాయంగా వుంటాననీ చెప్పి—ఇదేమిటోయ్?" గర్జించాడు అసిస్టెంటు,—చీఫ్ కేకలేసిన తాలూకు కోపంతో!

"చంపినాసరే బాబూ! నేను అడుగు వెయ్యను! దృఢ నిశ్చయంతో పరిసరాన్నంతా కలయజూస్తూ మొండిగా కూర్చున్నాడు వెంకయ్య!

అవమానాన్ని సహించలేక ఉగ్రుడైపోయాడు అసిస్టెంటు?

పరిస్థితి గమనించి, "ఆరాస్కాల్‌తో పనేమిటి? మనం వెళ్దాం పదండి! కావన్నా ఎంత దక్షిఏరియాస్ అండీ?" అన్నాడు చీఫ్.

వాటర్ బాటిల్, ఫ్లాస్కు తీసుకున్నాడు మల్లన్న.

తలోరకంగా విసుర్కొస్తూ ముందుకు సాగిపోయారు!

మెల్లిగా లేచి గట్టుమీదినుంచి జాగ్రత్తగాదిగి నీళ్ల అంచున కూర్చున్నాడు వెంకయ్య. చెరువువేపు చూచాడు. సన్నగావీచే సాయంకాలపు చల్లగాలికి చిన్నచిన్న అలలు లేచి తమాషాగా వుంది చూడటానికి. ఒకచోటనుంచి వేరొకచోటుకు ఉరికే కప్పపిల్లలు నీటిమీద పోదుగునా, సన్నగీతగీచి మునకలు వేస్తున్నాయి. దంభపుమనుషుల అర్థంలేని వాగ్దానాలమల్లే, ఆనీటిగీత మరుక్షణం మాయమై అక్కడే చిన్నచిన్న సుడులు తిరుగుతున్నాయి! ఒడ్డుపక్కగా చేపపిల్లలు జరజరపోతూ, కప్పలు చేసే చప్పుడుకు బెదరి దూరంగా పరుగెడ్తున్నాయి! చెట్టుమధ్యలో వున్న కలే చెట్టు, చుట్టూ నీటిపరిధిని ఏర్పాటుచేసుక అందంగా, హుందాగా నిల్చునివుంది!

చటుక్కున ఒంగి కొద్దిగా కదుల్తున్న నీళ్లలోకి తొంగి చూచాడు వెంకయ్య. ముడుతలు పడ్డనుదురూ, నల్లని గీరలూ, బోసినోరూ, బట్టతలతో వికృతమైన ఆకారం ప్రతిబింబించింది! ఆశ్చర్యంతో అల్లాగే చూస్తూ ఉండిపోయాడు!

ఒకనాటి వెంకటరెడ్డికీ, ఈనాటి ప్రతిబింబంలోని వెంకయ్యకూ ఎంత తేడా? ఆనాడు ఊరుఊరును ఒక్క ఊపుఊపిన వెంకటరెడ్డిదేనా ఈనాటిముసలి వికృతరూపం? ఎంతటి అధికారిఅయినా సరే, తనమాట జవదాటకూడదనే శాసనం పెట్టి, చెల్లించుకున్న మొనగాడిదేనా ఈ ముఖం? ఏమిటిలా మారింది? ఎందుకిలా అయింది? పై పెదవిని పూర్తిగా కప్పేస్తూ మెలితిరిగివున్న బుంగమీసాల్లోని ఆహుందాతనం ఈ నాడేలా పోయింది? .

ఎక్కడిదో కొంగ ఒకటి నీటిమీదఆని, గబుక్కున చేపపిల్లను మింగిపోవటంతో నీళ్లు గిరగిరతిరిగాయి. తిరిగే నీటిలానే, తలలో తలపులు తిరగడంతో, కాలగర్భంలో కలిసిపోయిన సంఘటనలేవో పైకివచ్చాయి! మెల్లిగా లేచి మళ్లీ గట్టుమీదకు వచ్చి కూచున్నాడు. చుట్టూ కలయ జూచాడు! కొద్దిదూరంలో, గున్నమామిడితోటకు అవతలగా ఊరు కనిపిస్తోంది! తోట నానుకునిఉన్న దిబ్బ మీద—అక్కడే ఓనాడు రంగాదాపరి ఇల్లుండేది! మరి కాస్తదూరంలో మాల, మాదిగల గుడిశెలు! చాకిపాలెం! తర్వాత ఆసాములఇళ్లు! అడ్డంగా వున్న రకరకాల చెట్ల మధ్యనుంచీ మట్టిమిద్దెలు కనిపిస్తున్నాయి! ఊరంతటికీ శిఖరంలా, ముందు గోడ్లచావిడీ, తాటాకుల పంచా, వెనక మేడా తనది! అది ఈనాడేదీ? దానిస్థానే ఇప్పుడూ కాస్త బూడిదకుప్ప మిగిలివుందేమో! ఆబూడిదలోనే, కలిసిపోయిన, భార్యా, బంగారంవంటికూతురూ తాలూకు ఆకృతులు క్షణకాలం మెరిశాయి!

"ఓరి వెంకటరెడ్డీ! ఎంతగతి పట్టిందిరా! ఇల్లూ వాకిలీ, పాడీ, పంటా, అన్నీ బుగ్గిపాలై, చివరకు ఈగతి పట్టావా?" అంటున్నట్లుంది ప్రకృతి!

"అవును పట్టాల్సిందే!" అతనిహృదయం బరువుగా మూలిగింది. అందులోనుంచి శెగలుపొగలుగా హృదయంలోని జ్వాల బయటికి వచ్చింది. మనోనేత్రాలు రెండూ, జాగ్రత్తగా తలపుల మెలపులలోనుంచి, ఇరవైఏళ్లనాటి సంఘటనల్ని బయటికి లాగాయి.

2

తెలతెలవారేముందు వేపపుల్ల నోట్లో పెట్టుకుని చెరువు దగ్గర్నుంచి వస్తున్నాడు వెంకటరెడ్డి! తలనిండా ఏవో ఆలోచనలు ఈగల్లా ముసురుతుంటే గబగబ అడుగులు వేస్తున్నాడు. ఈమాలమాదిగలంతా కలిసి సంఘంగా ఏర్పడుతారట! లేబరుసంఘమట! అదే ఏర్పడితే తనబోటి ఆసాములకు ఎంతో చిక్కువస్తుంది! వడ్డీలు తగ్గించా

లంటూరు! కూలీ పెంచాలంటూరు! తప్పిస్తే సమ్మెలు చేస్తామంటూరు! ఒకటేమిటి? "గడ్డివెంటి పెట్టి...." అన్నట్టుగా అవుతుంది తన పరిస్థితి! రంగాదాసరిగాడు దీనికి నాయకుడు. దూరాన ఏదో ఊరినుంచి, చుట్టపుచూపుగా మాలఅంకడి ఇంటికి వచ్చిన రంగడు, ఇక్కడే, భార్యా, పిల్లవాడితో స్థిరపడ్డాడు-గున్నమావితోట పక్కదిబ్బమీద ఇల్లు వేసుకున్నాడు. అక్కడ ఇల్లెందుకు వేసుకున్నావురా?" అంటూ అర్థంలేని అధికారం చూపబోయిన తనమీద "అది ఎవడితాతసొమ్ము కాదుకదు బాబూ!" అంటూ మెత్తటి చెప్పుతో కొట్టాడు! ఇవన్నీ చాలక ఇప్పుడో సంఘాన్ని కూడా లేవదీస్తున్నాడు!

రంగాదాసరిగాడ్ని చేజిక్కించుకుంటే చాలు! మిగతా "గొర్రెలగుంపు" అంతా చెదిరిపోతుంది!

ఇంటిలోగిట్లోకి వచ్చేసరికి మెరుపులాటి ఆలోచన వచ్చింది! ఎద్దులకు నీళ్లుపెడుతున్న జగ్గణ్ణిచూస్తూ "ఒరేయ్ జగ్గూ, అట్లా పోయి వేమిరెడ్డినీ తిమ్మానాయుణ్ణీ కేకేసుకు రారా!" అన్నాడు.

ఎద్దును గాటిగుంజకు కట్టేసి తలగుడ్డ సవరించుకొని బయల్దేరాడు జగ్గడు! నాలుగు అడుగులు వేశాడో లేదో "ఒరేయ్, ఊళ్లోవుంటే కరణాన్నికూడా కేకేసుకురా!" అంటూన్న యజమానిగొంతు విని సాగిపోయాడు జగ్గడు!

చద్దన్నానికి వచ్చిన భర్తనుచూస్తూ "ఏమట్లా ఉన్నావ్?" అంది రంగమ్మ!

"ఇవాళ ఆరంగడి అంతేమిటో తేల్చాలే!" అన్నాడు రెడ్డి కంచం ముందుకు లాక్కుంటూ!

"నీమాటె కాదంటాడుగా వాడు; కాకున్నా పిల్లిలా పూరుకున్నావ్, కాబట్టే వాడంతట్లోకి వచ్చాడు!" పురి పెట్టింది రంగమ్మ!

లోలోపలే మండిపడ్తూ "పిల్లిలా పూరుకున్నానా? మూడునిమిషాల్లో వాడి ఆట కట్టిస్తాను చూస్తుండు!" మీసం మెలేశాడు రెడ్డి!

"అన్నట్టు మన శేషులు ఏదే?" అన్నాడు మళ్లీ!

"గడ్డికి పోయిందిలే!"

చుట్ట నోట్లో పెట్టుకుంటూ వాకిటి అరుగుదగ్గరకు వస్తున్న రెడ్డిని చూస్తూనే "ఏంమావాఁ! కబురెట్టావుటా?" అంటూ అంగ లేసుకుంటూ వచ్చాడు తిమ్మానాయుడు!!

"రా! కూచో! కాస్తపనుందిలే! అన్నట్టు వేమయ్య కనపళ్లా?" అన్నాడు రెడ్డి. ఇద్దరూ అరుగుమీద కూర్చున్నారు.

"చద్దినీళ్లు తాగొస్తానన్నాడు! అదుగో మాటలో వస్తున్నాడు!"

"పొద్దున్నే ఏమంత పెద్దపని తగిలిందేమే? మన శేషులుకు మనుంగాని కుదిర్చావా ఏమిటి?" చుట్టరికపు "చనువుతో చమత్కరించాడు, వేమిరెడ్డి!

"ఆ! ఆ! పెళ్లికూడాను!"

ముగ్గురూ మౌనంగా కూచున్నారు కాస్సేపు!

"మన రంగాదాసరిగాడి తంతు చూస్తున్నారుగా?" రెడ్డి ఉపోద్ఘాతంగా ప్రశ్న వేశాడు.

"ఏదో లేబరుసంఘమట.... పెడుతున్నాడుటకదూ?" నాయుడు తెలీనట్టుగానే అడిగాడు!

"నిజంగానా? వాడంతపని చేస్తాడా?" రెడ్డి కరటకుడి మొహం పెట్టాడు!

"చేస్తాడా ఏమిటే? చేశాడు! నిన్న మాలపల్లెలో మీటింగట! కూలీలు ఎక్కువ అడగాలనీ, లేకుంటే సమ్మె చెయ్యాలనీను!" నాయుడు వివరించాడు!

"నువ్వు కబురంపించి నాలుగూ పెట్టలేకపోయావ్ మావాఁ!" వేమిరెడ్డి వెంకటరెడ్డివేపు చూచాడు!

తోటలో కపిలదగ్గర ముందురోజు సాయంత్రం జరిగిన సంఘటన బుర్రలో మెదిలింది రెడ్డికి!

కాలవదగ్గర నిలబడి, గట్టుమీద వెళ్తున్న రంగాదాసరిని కేకేశాడు రెడ్డి!

"ఏమిటిబాబూ!" వినయంగా అడిగాడు రంగడు!

దృఢంగా, నల్లగా, వెనకజుట్టుముడితో నిల్చుని వున్న దాసరిని చూస్తూ నిప్పులు కురిపించాడు రెడ్డి!

"ఏమిటోయ్? ఏదో సంఘం తయారు చేస్తున్నావుట... దోపిడీగాని చేయిస్తావేంరా?" అన్నాడు.

"ఎక్కడేనా" కూలి సంఘాలు "దోపిడీలు చేశాయా బాబూ? ఏదో కాస్త బతుకుతెరువు చూసుకుంటున్నాం, అంతే!" మెత్తగానే నాలుగూ పెట్టాడు రంగడు.

"ఈఊళ్లో నామాటే కాదంటావుటా? ఏమవుతుందో తెలుసా?" రెడ్డి మీసం మెలేశాడు!

"ఏమౌతుంది బాబూ? సరికిసరి వడ్డీలుగుంజి లక్షలు లక్షలు పోగేసిన మీబోటివాళ్లంతా ఏంచేస్తారు? ప్రాణాలు తీస్తారు అంతేగా?" రంగడు జవాబు ఆశించకుండా విసవిస వెళ్లిపోయాడు!

నిర్ఘాంతపోయాడు రెడ్డి? ఆనిముషంలో అతనికి మూడో కన్నే లేదుగానీ, ఉంటే మరుక్షణంలో రంగడు ఆకంటి చూపుతో భస్మం అయిపోయేవాడేమో! హుఁ! ముందు వీడి పని పట్టాలి!

నిన్నటి దృఢనిశ్చయం మనసులో మెదిలింది.

"ఐనా నీమాట కాదంటాడా?" నాయుడు పొగాకు కాడ తుంచుకుంటూ రాజబెట్టాడు అగ్గిని! "ఒకసారి పిలిపించాలా రెడ్డి?" వేమిరెడ్డి సమిధలు వేశాడు!

"ఇవాళ కూలి పెంచాలంటాడు, వడ్డీ తగ్గించాలంటాడు-- రేపు ఊరు వదలి వెళ్లమంటాడు!" నాయుడు ఆజ్యం పోశాడు!

మంట రేగిన రెడ్డి "వాడి అంతు తేలుస్తానే!" అన్నాడు మీసం మెలేస్తూ. గాటిగుంజను ఊడలాక్కుని వీధిన పడింది కోడె! కఱ్ఱ చేతబట్టి రొప్పుతూ:

"ఎవర్రోయ్ ఆపోయేమాసి? కాస్త అడ్డంరాండర్రోయ్!" కేకవేశాడు జగ్గడు.

చేతిలో వున్న బడితెతో అడ్డంవచ్చి "హశావ్" అంటూ అదిలించాడు రంగాదాసరి. కోడె నిలిచింది. శిగమారపట్టుక లాక్కొచ్చాడు జగ్గడు.

"ఒరేయ్ జగ్గూ! వాణ్ణిటు పిలవరా!" అన్నాడు నాయుడు, ఆడబోయిన తీర్థం ఎదురైనట్టు సంతోషంతో.

"ఒరేయ్ రంగా! మన పెద్దరెడ్డికి బాగా తలనొప్పిగా వుంది నీవ్యవహారం!" అన్నాడు నాయుడు మళ్లీ-దూరంగా వినయంగా చేతులుకట్టుక నిల్చున్న రంగాదాసరి వేపు చూస్తూ!

"కాస్త తిండీ గుడ్డా దొరికేమార్గం చూచుకుంటే మీకు కష్టం దేనికి బాబూ?" తొణుకూ బెణుకూ లేకుండా ఎదురు ప్రశ్న వేస్తూ!

కాస్త దూరంలో గేదెపాలు తీస్తున్న రంగమ్మ, దూడను వదలి, పాలచెంబు చేతబట్టుక రంగంలోకి వచ్చింది. "అయితే ఆసామి మాటనే కాదంటావుట్రా రంగా? 'కూసేగాడిద వచ్చి' అన్నట్టుగా నువ్వొచ్చి మాలమాదిగ వెధవలనంతా చెడుపుతున్నావుగా?" అంది ఊరిపెత్తందారు భార్య కంఠస్వరంతో హుందాగా!

"చూస్తానే-వీడూ - వీడిసంఘూ లేవిటో!" రెడ్డి పళ్లు కొరికాడు.

"పక్కలిరగతన్ని పంపిస్తారోయ్!" వేమిరెడ్డి చెయ్యి అరుగుమీద తట్టాడు!

"చంపినాసరే బాబూ, దిగిన పనిలోంచి ఇవతలికిరాను!" జవాబు ఆశించకుండా విసవిస వెళ్లిపోయాడు రంగాదాసరి!

నిర్ఘాంతపోయారు నలుగురూ!

"ఎంత తలతిక్క!" నాయుడు ఆశ్చర్యం ప్రకటించాడు!

"ఏంచేద్దామే?" రెడ్డి సలహా అర్థించాడు!
తీవ్రాలోచన తర్వాత రెడ్డి భయంకరమైన నిర్ణయాని కొచ్చాడు.

"ఒక్కటే మందుంది! నాలుగుదెబ్బలేసి వూరుకుంటే వాడిది పాముపగ! అందులోనూ సంఘబలం వుంది! చూడూ...." రహస్యంగా అభిప్రాయాన్ని వెల్లడించాడు వెంకటరెడ్డి!

వెలవెలబోయిన మొహంతో "అంతపనెందుకు?" అంటూ మళ్లీ ఇంట్లో జీతగాడుకూడా లేడు వెళ్లాలె!" అంటూ లేచి గబగబ సాగాడు నాయుడు!

"ఉండుతిమ్మయ్యా! నాకూ కొలిమిదగ్గర కాస్త పనుంది వస్తానే మావాఁ!"

జారుకున్నాడు వేమిరెడ్డి!

వాళ్లిద్దరూ వెళ్తున్నవేపు కాస్సేపుచూచి "థూఁ! పిరికి యెదవలు!" అంటూ వుమ్మేసి ఇంట్లోకి వెళ్లిపోయాడు రెడ్డి పథకం ఆలోచించుకుంటూ!

అప్పటికప్పుడే రెడ్డిఇంట్లో రంగడు చేసిన "ఓఘాయిత్యం" ఊరునలుమూలలా వ్యాపించింది! రకరకాలుగా అనుకుంటూ, రంగడిక ఎట్లా ఈవూళ్లో వుంటాడా? అనేప్రశ్నమీద వాదోపవాదాలుకూడా బయల్దేరినయ్!

♦ ♦ ♦

కార్తీకమాసం చలికి భయపడి గుడిశెల్లో పడుకుని గుర్రుపెడ్తున్నారు జనమంతా! పగలంతా పరిశ్రమించి విశ్రాంతిగ మైమరచి నిద్రపోతున్నారు అంతా!

నడికొప్పులో, గుడిశె మూడువేపులా నిప్పుఅంటించగానే సురసుర అంటుకుంది ఎండుతాటాకు! మూడు ఆకారాలు పరుగు లంకించుకున్నాయి చేలగుండా!

"అయిందా పని?" హుంకరించాడు రెడ్డి గొడ్లచావిడి చాటుగా!

"ఊఁ" గజగజ ఒణుకుతూ ఆమూడుశరీరాలూ తలలూపాయి!

అరగంటలో నడికొప్పు నెత్తిన పడి, బయట తాళంవేసి వుంటంవల్ల, ఎటూ పోయే వీలులేక, మంటలవేడికి తట్టుకోలేక అలమటించ్చిన, రంగాదాసరిభార్యనూ, పదేళ్లకొడుకునూ ఎవ్వరూ కాపాడలేకపోయారు!

ఆర్పినను సిలో రంగాదాసరి శవం కనిపించక బూడిద అయిపోయిందనుకున్నారు! కారకుడెవరయిందీ తెలిసినా, కత్తిగట్టే ధైర్యంలేక లోలోపలే అణచివేశారా భావాన్ని కూలిజనం!

దూరాన, కళ్లెదుట కాలుతున్న ఇంటినీ, శాయశక్తులా ప్రయత్నించినా, రక్షించుకోలేని భార్యాబిడ్డల మాడిన శరీరాల్నీ ఊహించుకుంటూ, కమిలిపోయిన శరీరంతో, రగిలేపగతో, ప్రతీకారవాంఛతో వెళ్లిపోయిన రంగాదాసరిని ఆగలభాలో గుర్తించిందెవరు?

గిరుక్కున ఆరుకాలెండర్లు మూలబడ్డాయి పట్నమాసాల్లో! ఆరోసారి నాగులచవితి రాబోతోంది, పల్లెటూళ్లలో ఈసంఘటనతర్వాత!

పొరుగూరునుంచి శేషులుకు మనువుమాట్లాడి, హుషారుగా తిరిగివస్తున్నాడు, రెడ్డి! విరగబండివున్న గున్నమామిడితోటనుంచి, మామిడిచిగురువాసన గుప్పున కొడుతోంది! సాయంకాలపు చల్లగాలికి పైనున్న జరీకండువా రెపరెపలాడుతోంది! తోటదాటి కయ్యలో అడుగుపెట్టాడు రెడ్డి!

దూరాన గొర్రెలుకాస్తున్న గొల్లరాముడు రొప్పుతూ వచ్చాడు. రెడ్డిని పోల్చుకుని!

"బాబూ ఇల్లుకాలిపోయింది!" అన్నాడు ఏడుపు స్వరంతో!

"ఎందుకనిరా! కాకున్నా అంతబుద్ధి లేకుండా, అజాగ్రత్తగా ఎందుకున్నార్రా మీరంతా?" రెడ్డి హుందాగా అడిగాడు! సానుభూతికి బదులు కర్కశంగా వున్నాయా మాటలు!

"నాదికాదు బాబూ తమది... అమ్మగోరూ... బుల్లెమ్మగోరూకూడా...."

రెడ్డికింకేమీ వినిపించలేదు! కుప్పగా కూలబడిపోయాడు గట్టుమీద:

"అర్ధరేత్రికాడ ఎట్టంటుకుందో ఏటో! భగభగ మండుతున్నాది! ఆడకూతుళ్ల ఏడుపు విని అందరం పోగయ్యేసరికే....అంతా బూడిదై పోయింది బాబూ! అదేం చిత్రమో దొడ్డాకిలికీ తాళమే, వాకిలికీ తాళమే!...." కళ్లముందు కనబడేలా వర్ణిస్తున్నాడు రాముడు!

రెడ్డికివేమీ వినిపించటంలేదు! భగభగమండే ఎర్రటి మంటల్లో, నిస్సహాయస్థితిలో అరుస్తూ, ఏడుస్తున్న రంగమ్మా, బొబ్బలెక్కిన లేతశరీరంతో కిందపడి పోయిన శేషులూ, కళ్లముందు నిలిచారు! మరుక్షణంలో వాళ్లే రంగాదాసరి, భార్యా, బుగ్గిఅయిన కొడుకులా మారిపోయారు! ఆనాటి తన అమానుషపుపనికి ఈనాడు తగిన శాస్తిచేశాడు దేవుడు! కానీ ఎవరుపెట్టారు నిప్పు? ఈ ప్రశ్న అతనికి తోచలేదు!

పిచ్చిగా లేచి ఊళ్లోకి వస్తున్న రెడ్డినిచూస్తూ "మత్తుజల్లినట్టు నిద్రపట్టింది మావాం! ఏంచేస్తాం? అంతా దేవుడి చిత్రం! సరిగ్గా ఆనాడు రంగడియిల్లు తగలబడ్డట్టే....నీది కూడా!" వక్రంగా చూస్తూ సానుభూతితోపాటు గత సంఘటన గెలికాడు వేమిరెడ్డి! విసవిస నడచి వెళ్లిపోయాడు రెడ్డి! ఆబూడిదకుప్పను చూస్తూ....ఆస్తి, పెత్తనం, పౌరుషం ఇక ఎవరికోసం? ఎందుకు?

◆ ◆ ◆

మళ్లీ ఇన్నేళ్లతర్వాత ఈనాడు తనఊరు చూచాడు! చెరువులో ఏదో గోండురుకప్ప దూకటంతో దభీమని చప్పుడయింది! త్రుళ్లిపడి ఆలోచనలనుంచి తేరుకున్నాడు రెడ్డి! ఒక్కసారి ఆబూడిదనే మళ్లీ చూడాలనే పిచ్చి మనుకారం పీకుతోంది! లేచాడు! బాగా చీకటిపడింది! తడబడే అడుగులతో కట్టమీదినుంచి రెండడుగులు వేశాడు! కాళ్లు తేలిపోతున్నాయి! శరీరం తూలిపోతోంది! కళ్లు గిర్రునతిరిగాయి! వేగంగా ఏటవాలుగా దొర్లుతూ కింద నాగజెముడు పొదల్లో శాశ్వతంగా పడిపోయాడు వెంకయ్య....ఒకనాటి చండప్రచండుడు వెంకటరెడ్డి!

మనోహర సత్యం

శ్రీమతి భైరవభొట్ల లీలాసీతారామ్

నాల్గుమూలల వెదకి చూచితి
నాల్గుదిక్కుల కలయజూచితి
నాకు కనపడరాక యున్నది
నగ్నసత్యమిలన్
మోసకారుల ప్రక్క నుండగ
వీసమోర్వగలేను భువిలో
పోదు వనచర మృగములన్‌గని
మోదమందంగన్.
మనసులో నొకమాట యుండున్
వినుదు నింకొకమాట నోటన్
తలచు నొక్కటి పలుకు నొక్కటి
భళిరె! చూడు నరున్!
చీకుచింతలతోడి మనుజుల్
వీకలేక తుపానులోపల
ఆకులల్లల నాడు నెట్లో
అట్లు మనుదురుగా!
సంకుచితమౌ భావపరిధుల్
సంకుచితమౌ దృష్టివలయాల్
చుట్టుముట్ట పరిభ్రమింతురు
చూడు మానవులన్!
వున్నదానితొ తృప్తి జెందుచు
నుండు నెంతో హాయినందుచు
లేనిదానికి దిగులుపడుటే
లేదు మృగములకున్.
ఎంత ఆకలియుండె తినుచున్
సుంతఅయినను కూడ బెట్టవు
ఇంత సంపద కద్దటంచును
ఈర్ష్య చెందవుగా!
చరించు యథేచ్ఛగా
రహించుగా సుఖమ్ముగా
రమించుగా ప్రమాదమై
వరించుగా ప్రశాంతమున్.
విశాలమౌ వనీస్థలిన్
ప్రశాంత మానసాలతో
చరించు జంతుజాలమే
నిరంతరం మనోహరం.

మహిళా విద్యాభివృద్ధి

న్యూఢిల్లీలోని విజ్ఞానభవనంలో మహిళా విద్యా జాతీయ సంఘము యొక్క మూడవసమావేశం 10-5-1961 తారీఖున శ్రీమతి దుర్గాబాయి దేశముఖ్ అగ్రాసనాధిపత్యంక్రింద జరిగింది. కేంద్ర విద్యాశాఖామంత్రి శ్రీ (డాక్టరు) కే. యల్. శ్రీమాలి, విద్యాశాఖా కార్యదర్శి శ్రీ పి. యన్. కృపాల్, సంయుక్తకారదర్శి, శ్రీ (డాక్టరు) మల్హోత్రా విద్యాశాఖా పథకనిర్మాణానికి (Education Division of the planning Commission) సంబంధించిన శ్రీ డి. పి. నాయర్ మున్నగువారు ఆసమావేశంలో పాల్గొన్నారు. ఆసందర్భంలో శ్రీమాలి గారు ఈవిధంగా చెప్పారు:-

స్త్రీల విద్యావిషయంలో ప్రభుత్వం పక్షపాతం చూపుతున్నదనే దురభిప్రాయం సంఘంలో పాతుకుపోయింది. దాన్ని తొలగించడం ముఖ్యకర్తవ్యం. మహిళా విద్యావశ్యకతనుగూర్చి ప్రజకు చక్కగ ఎరుకపడేట్టు చేయాలి. మూడవపంచవర్ష ప్రణాళికా కాలంలో అందుకై కేటాయించబడినద్రవ్యం చాలదనే అసంతృప్తి సంఘంలో కనబడుతున్నది. ఈనాటి పరిస్థితులను బట్టి చూస్తే ఆర్థికంగా ప్రభుత్వం ఒకపరిమితికి లోబడి, అన్నికార్యక్రమాలు దొరికినద్రవ్యంతోనే సక్రమంగా, పొదుపువిధానాన్ని అనుసరించి నెరవేర్చాలి. స్త్రీలకు విద్యాసౌకర్యాలు కలిగించవలసిన అవసరాన్ని గూర్చి, ప్రభుత్వం పూర్తిగా గుర్తించింది. కనుక అప్పుడప్పుడు కాలానుగుణ్యంగా అది సాధ్యమయినంతవరకు సహాయపడగలదు. ఈరోజుల్లో నిస్సందేహంగా సంఘోన్నతికేగాక, ఆర్థికాభివృద్ధికికూడా మహిళలవిద్య పెంపొందాల్ననే విషయంలో, ప్రజాభిప్రాయం నిష్పక్షపాతం సూచిస్తున్నది. ఒకపరిమితికి లోబడిన ఆర్థికసహాయంతో ప్రజానీకంమీద, ఆధారపడి నమ్మకంతో, మన ఉత్తమ కార్యం, (అనగా స్త్రీవిద్యాభివృద్ధి) చేయవచ్చునని దృఢంగా చెప్పవచ్చును. అప్పుడు మనఉద్దేశప్రకారం అబలావిద్యాభ్యుదయం చక్కగా సఫలం అవుతుంది. ఈవిషయంలో ప్రభుత్వం శాసనాలుచేసినా, ఎక్కువగా పాఠశాలలు స్థాపించినా, మనము ఊహించినంత ప్రయోజనం కనిపించదు. మనము స్త్రీలకు ఇచ్చే విద్యావిధానాన్నిపట్టి దానిఅభివృద్ధి వ్యాపింపజేయటానికి అవకాశాలు కలుగుతాయి. ప్రకృతం విద్యాశాలల్లో తగినన్ని సాధనోపపత్తులు, తరిబీతుపొందిన ఉపాధ్యాయులు లేరు. జాతీయ విద్యాసంఘసభ్యులు స్త్రీవిద్యాభివృద్ధికి తగిన వాతావరణాన్ని కల్పించి, తద్వారా పొందగలిగిన ఫలితంమీద తాము శ్రద్ధవహించ వచ్చును. అందుచేత మహిళామణుల విద్యాబోధన కనుకూలంగా పాఠశాలలను స్థాపించటం, వసతిగృహాలను ఏర్పరచటం, విద్యాసాధనాలు సమకూర్చటం,- యిలాటివాటికి ప్రజలతోడ్పాటును సులభంగా పొందవచ్చును.

తరువాత అగ్రాసనాధిపత్యం వహించిన స్త్రీల జాతీయ విద్యా సంఘాధ్యక్షురాలయిన శ్రీమతి॥ దుర్గాబాయి దేశముఖ్ గారు ఉపన్యసించారు. ఆమె కేంద్రవిద్యాశాఖామంత్రివర్గం స్త్రీలవిద్యావిషయంలో చూపుతూఉండే అలక్ష్యభావాన్ని చాలాతీవ్రంగా విమర్శిస్తూ ప్రభుత్వం "వ్యతిరేకపద్ధతి"-అవలంబించింది అన్నారు. అట్టిపద్ధతి స్త్రీల జాతీయ విద్యావిధాన సంఘం యొక్క ఉద్దేశాలకు భంగకరమని ప్రకృతపరిస్థితుల్లో విద్యాసంఘానికి తాను అధ్యక్షురాలుగ ఉండటానికి సాధ్యంకాదని, తానాపదవి నుండి తొలగటమే యుక్తం అని వెల్లడించారు. తాను ప్రశాంతగా కొంతకాలం ఓర్చుకొని ప్రయోజనంలేకపోయిందనీ, ప్రకృతం తాను బొత్తిగా నిస్సహాయస్థితిలో ఉన్నానని చెబుతూ, మహిళా విద్యాభ్యుదయానికి తాము కోరిన వాటిని పథక నిర్మాణసంఘం (Planning Commission)పూర్తిగా నిరాకరించిందని, ఆకారణంచేత స్త్రీల విద్యావిధానంలో ఉద్దేశించిన కార్యక్రమాలన్నీ నెరవేరటం అసాధ్యమని ఆమె వాకొన్నారు.

"ఆయా రాష్ట్రాల విద్యాసంఘాలు, కేంద్రవిద్యాశాఖామంత్రివర్గాలు పథకనిర్మాణానికి ఏర్పడిన కార్యసమితులు స్త్రీల విద్యాభ్యుదయవిషయంలో చూపుతున్న అశ్రద్ధ మహిళల విద్యాసమస్య కొకసవాలుగా గ్రహింపవలసివస్తున్నది. విద్యాసంఘం స్వాధీనంలో ఉన్న చాలతక్కువయిన ఆర్థికసహాయంతో ప్రణాళికలో సూచించిన ప్రకారం స్త్రీల విద్యాభివృద్ధిని సాధించటం దుర్ఘటం. ఆయా రాష్ట్ర విద్యాసంఘాలు ఈసవాలును అంగీకరించి చేకొనాలి. మూడవ పంచవర్ష ప్రణాళిక మహిళల విద్యకొఱకు కేటాయించిన 900 కోట్ల రూపాయలను పథకాల నిర్మాణ సంఘం 400 కోట్లరూపాయలకు తగ్గించింది. అందులోనూ క్రమంగా ఇంకకొంచెం తగ్గిపోవచ్చును. కేం

ద్రప్రభుత్వం యువతుల విద్యాభ్యుదయానికి తయారుచేసిన ప్రణాళికా కార్యాలు అంతటా ఒకశే మోస్తరుగా ఉండాల్ననీ రాష్ట్రప్రభుత్వాలు కోరుతున్నాయి. కాని అదికూడా కేంద్రప్రభుత్వం అంగీకరించలేదు. రాష్ట్ర ప్రభుత్వాలు చాలినంత ఆర్థికోపపత్తులు లేకుండా, కేంద్రం సూచించిన నిర్ణయాలను ఈవిషయంలో తాము సాగించలేమని ఇదివరకే తెలిపినాయి.

కావలసినంత శ్రద్ధ. చాలినంత ఆర్థికసహాయం యేమాత్రంలేకుండా, 'జాతీయాభివృద్ధికి వనితామణుల విద్య పెంపొందటం మిక్కిలి ముఖ్యం' అని చెప్పినంత మాత్రాన ప్రయోజనంలేదు.

ఈవిషయంలో కేంద్రప్రభుత్వం తాను అవలంబించదలచిన పద్ధతులు ఏమిటో వివరించటం ముఖ్యం" అని చెబుతూ, శ్రీమతి దేశముఖుగారు సభకు హాజరయిన ఆ యా రాష్ట్రప్రతినిధులకు యిలా చెప్పినారు. "దుఃఖకరం అయిన నా అనుభవాన్ని గూర్చి తెలపటానికే మిమ్మల్ని ఇక్కడికి ఆహ్వానించాల్సివచ్చింది. ఇక ముందుముందు మనం అవలంబించాల్సిన పద్ధతులను గూర్చి మీరు తీర్మానించవలసిఉన్నది"— అని అన్నారు. వస్తువిజ్ఞాన (Scientific) పరిశోధనా, (Cultural) సంస్కృతిశాఖామాత్యవర్గం కన్యలకొరకు 27 సాంకేతికసంస్థల్ని నెలకొల్పే పథకాన్ని ఒకదాన్ని తయారుచేశారు. ప్రతిరాష్ట్రంలో అట్టిసంస్థలను ఒకటి రెండు స్థాపించి, తగిన రంగాలలో ఆరాష్ట్ర ప్రభుత్వం యొక్కయు స్వచ్ఛంద ప్రజాసంస్థలయొక్కయు సహకారంతో యువతులకి తరిబీతు ఇవ్వటానికి తగిన ప్లానులు సిద్ధమయి వున్నాయి. మూడవ ప్రణాళికా కార్యక్రమాల్లో అట్టివాటిని కొనసాగించటానికి— కేంద్రప్రభుత్వం 3కోట్ల రూపాయలను మంజూరుచేసింది. కనుక రాష్ట్ర విద్యాసంఘ ప్రతినిధులు ఈవిద్యాక్రమానికి ప్రజలుకూడా తోడ్పడేటట్టు ప్రోత్సహిస్తే, రాష్ట్రప్రభుత్వాలు వ్యయం చేయదలచిన మొత్తాలలో కొంతవరకు తగ్గిపోవటానికి అవకాశం కలుగుతుంది.

మహిళా జాతీయ సంస్థలవిషయంలో శ్రీమతి ఇందిరాగాంధీగారి నాయకత్వంక్రింద ఏర్పడిన విచారణ సంఘం ఒక నివేదికను కేంద్రవిద్యాశాఖామంత్రివర్గానికి సమర్పించింది. దాన్ని అనుసరించి మొట్టమొదటి మహిళా జాతీయ సంస్థ 1962నుండి పని చేయగలదనే నమ్మకం గలదు" అని శ్రీమతి దేశముఖ్ గారు ఉపన్యసించారు.

తరువాత విద్యాశాఖకు సంయుక్తకార్యదర్శి అయిన— శ్రీమల్హోత్రాగారు:— కన్యలకును మహిళలకును సంబంధించిన విద్యాకార్యక్రమాలకు పథకనిర్మాణసంఘంవారు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని, త్వరగానే వారు తమపథకాన్ని గూర్చి విద్యాశాఖామాత్య బృందంతో చర్చింపనున్నారనీ తెలిపారు.

(హిందూ : 11.5.1961)

నిరాధారలయిన మహిళలకు వృత్తులు

కేంద్ర సంఘసంక్షేమసమితి కధ్యక్షురాలయిన శ్రీమతి॥ దుర్గాబాయి దేశముఖ్ గారు, 12—5—61న సిమ్లాలో సమావేశంఅయిన హిమాచలప్రదేశ సంఘసంక్షేమసభకు సంబంధించిన జిల్లాప్రాజక్టు సాధనసంఘాల అధ్యక్షుల సమావేశంలో ఇలా చెప్పారు:—

"దేశంలో నిరాధారలయిన 35,000మంది స్త్రీలకు సంక్షేమసమితి పెక్కు ప్రణాళికాకార్యక్రమాల్లో వృత్తులు కల్పించగలిగింది. దేశంలో విద్యావతులయిన మహిళలు నూటికి ఎనిమిదిమందిమాత్రమే గలరు. మొత్తంమీద భారతరమణీమణులు ఆర్థికవిషయాల్లో తమ భర్తలకు చేదోడువాదోడుగ సహకరించాల్నని బాగా గుర్తించారు. కాని, సంసారం నిగ్రహించే విషయంలో పురుషులతోబాటు వారుకూడా సమభాగస్థులమని గ్రహించటానికి ఎంతోకృషి జరగటం అత్యవసరం.

కుష్ఠరోగుల బిడ్డలు

కుష్ఠవ్యాధిబాధితుల బిడ్డలకు ఆరోగ్యాన్ని చేకూర్చే పరిసరాలను కల్పించటానికీ, వ్యాధి కుదిరినవెనుక వారికి ప్రత్యేకస్థలం సమకూర్చటానికి, పనిచేసే ప్రత్యేకసంస్థలకు ధారాళంగా గ్రాంట్లు ఇవ్వటానికి ప్రభుత్వం తగినయేర్పాట్లు చేస్తున్నది. మూడవ పంచవర్షప్రణాళికా కాలంలో ఇందుకొరకై వెచ్చపెట్టటానికి పెద్దమొత్తాన్ని ప్రభుత్వం కేటాయించి వుంచింది.

('హిందు'- 14-5-1961)

ఆంధ్రమహిళా సభ - బర్కత్పుర, హైదరాబాదు.

పైసభకు సంబంధించిన ప్రాంతీయ కుటీరపరిశ్రమల శాఖలో తరిబీతునొందిన మహిళలవీడ్కోలు సభ 22-4-1961 వ తారీఖున సాయంకాలము సమావేశం అయినది.

ఆసందర్భంలో మహిళాసభ సంయుక్త కార్యదర్శిని అయిన శ్రీమతి॥ లీలా గౌరీ బాజీగారు సభ్యులకు స్వాగతమిస్తూ మహిళాసభ స్థిరంగా పరిశ్రమాభ్యాసాన్ని కొందరికి నేర్పడమే కాకుండా, కొంతవయోధిక్యతగల స్త్రీలకు సంగ్రహంగా అల్పకాలంలో ముగిసే తరిబీతును ఇవ్వటానికి — చేనేత, బట్టలఉత్పత్తి కొనసాగించే కేంద్రాన్ని సాగించటానికీ,— ఇతరచేతిపనులు నేర్పటానికి తగినఏర్పాట్లు చేసినవని తెలిపారు.

మహిళాసభ సూపరెంటెండెంటు అయిన శ్రీమతి॥ జి. జి. ఎయిరేగారు వార్షికనివేదికను ఆసభలో సమర్పించారు.

చిన్నచిన్న పరిశ్రమలకు మంత్రిఅయిన శ్రీ కొండా లక్ష్మణబాపూజీగారు ఆనాటిసభలో వీడ్కోలు ఉపన్యాసమిస్తూ ఇలా చెప్పారు :— 'మహిళామణుల అభ్యుదయ కార్యక్రమాల్లో ఆర్థికవిధానం యొక్క ప్రాధాన్యాన్ని గుర్తించాలి. ఆంధ్రమహిళాసభ మోస్తరు స్వయంకృషితో పనిచేసే సంస్థలకు ప్రభుత్వం అన్నివిధాలా సౌకర్యాలు కలిగిస్తూ గృహిణుల ఆర్థికాదాయానికి దారి చూపగలదు?'— తరువాత మంత్రిగారు. మహిళల ఉద్యమానికి, వారిపురోభివృద్ధికి చిహ్నంగా, ఆంధ్రమహిళాసభను స్థాపించిన శ్రీమతి॥దుర్గాబాయి దేశముఖ్ గారి అచంచలకృషి నిగూర్చి చాలా ప్రశంసించారు.

హైదరాబాదులో ఆంధ్రమహిళాసభకయి చక్కని భవనాన్ని నిర్మించటానికి ఉచితంగా ప్రభుత్వం స్థలం ఇవ్వాలన్నని తీర్మానించుకొన్నదనీ, అందుకయి సౌకర్యమయిన చోటుకొఱకు అన్వేషిస్తున్నదని మంత్రిగారు సభలో వెల్లడించారు.

అంతేగాక, మహిళాసభకు సాధ్యమయినంతవరకు అన్నివిషయాలలో సాహాయ్యపడ సిద్ధముగా ఉన్నదనీ అక్కడ తరిబీతయిన వారికి ప్రభుత్వమే జీవనోపాధులు కల్పించగలదనికూడ సెలవిచ్చారు. కాని, అట్లు బోధనాభ్యాసం పొందినవారు బ్రతుకుతెరువుకయి అన్యప్రదేశాలకు వెళ్లటానికి బదులు, తమతమ నివాసస్థలాల్లోనే తాము నేర్చుకొన్న కుటీరపరిశ్రమలు చేసుకొంటూ జీవించవచ్చుననీ, వారికి కూడా, ఆర్థికంగా ప్రభుత్వం సహాయం చేయగలదనీ, ఆవుద్దేశంతోనే ప్రకృతం ప్రభుత్వం కొన్నిపథకాలను తయారుచేయటాన్నిగూర్చి ఆలోచిస్తున్నదనీ— తెలిపారు.

మహిళాసభకు మఱొక సంయుక్తకార్యదర్శిని అయిన శ్రీమతి॥ సుగుణమణిగారి సభాభివందనములతోను, కొన్ని వినోదకార్యక్రమాలతోను ఆనాటి సభాసమావేశం సమాప్తి అయింది.

కే. సుగుణమణి,
సంయుక్త కార్యదర్శిని, బర్కత్పుర.

శిశు సంక్షేమ సభా విన్నపాలు

ప్రభుత్వానికి కొన్నిసూచనలు

1. కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు క్రొత్తపథకాలను అభ్యుదయకార్యాలను శిశుజనక్షేమార్థం వెంటనే చేకొనాలి.

2. పిల్లలకు అత్యవసరంగా (అన్నిరంగాలలో) అభివృద్ధి చెందటానికి కావలసిన సాధనాలను క్రొత్తగ సమకూర్చి వారివిషయంలో జాగ్రత్తవహించి పనిచేయాలి.

3. మూడవప్రణాళికలో పిల్లల సంక్షేమానికై మూడుకోట్లరూపాయలు ప్రభుత్వం ప్రత్యేకించినందుకు అభినందిస్తూ, ఇంకను అందుకై జరుగుచున్న కృషికి చాలినంత అనుకూలాలను కల్పించాలి. దాన్ని ఒకప్రత్యేకసమస్యగా భావించి శ్రద్ధగా చూడాలి.

రెండుదినాలు జరిగిన ఈ శిశుసంక్షేమ సభాసమావేశాల కడపట సభాధ్యక్షురాలయిన శ్రీమతి ఇందిరా గాంధిగారును, గృహనిర్మాణ సరఫరా శాఖల మంత్రి అయిన శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారును— "భావి భారత దేశావసరాలను అభ్యుదయమార్గాలను మనస్సులో ఉంచుకొని, సాధారణంగా పిల్లలలో కనిపించే లోటుబాటులను గుర్తిస్తూ, వారిని అన్నివిధాలా బాగుపడేటట్లు చేయటం ప్రధానకర్తవ్యం" అని నొక్కి చెప్పారు.

శ్రీమతి ఇందిరాగాంధిగారు ఆంధ్రప్రదేశ్ లోని పటాన్‌చెరువులోను, ఢిల్లీరాష్ట్రంలోని మెహ్రౌలీగ్రామంలోను ప్రకృతం రెండుప్రాజక్టులు నెలకొల్పి, పిల్లలు

పుట్టినప్పటినుండి యుక్తవయస్సు వచ్చేవరకు, అందు తరిబీతు పొందేటట్లు కృషిచేయటానికి సంక్షేమసంఘం, తీర్మానించుకొన్నది. కాగా, ఆరోగ్యము, విద్య, శక్తి, సమర్థత, విశ్రాంతి మొదలయినవాటికి తగిన సౌకర్యాలు ఆరెండుస్థలాలలోను వారికి సమకూర్చటానికి సంఘం సర్వవిధాలా ప్రయత్నిస్తున్నది. దీనికి ప్రభుత్వం కూడా అంగీకరించింది. ఈలాటి ప్రాజక్టులను ముందుముందు అన్నిరాష్ట్రాలలోను ఏర్పరచాల్నని సంక్షేమసంఘం ఉద్దేశించింది. ఈమూడవ ప్రణాళికా కాలంలోనే పంజాబు, మహారాష్ట్రం, గుజరాతు, పశ్చిమబంగాళం, మదరాసు రాష్ట్రాలలోకూడా, ఇట్టిప్రాజక్టులు స్థాపించటానికి సంఘం నిశ్చయించింది.

సంఘం నెరవేర్చదలచుకొన్న మరొక ముఖ్యకార్యం ఏమంటే:— బాలసేవికలకు తరిబీతునిచ్చే కార్యక్రమనిర్మాణం. అట్టివి ఈ మూడవ ప్రణాళికా కాలంలో ఆరింటిని ఏర్పాటుచేయాల్నని అంచనా. అవి ఆయారాష్ట్రప్రాంతాలలో కేంద్రస్థలాల్లో ఉంటాయి. ఈబాలసేవికా బోధనాభ్యాస ప్రదేశాలు ప్రకృతం రెండు నెలకొల్పబడతాయి. ప్రణాళికా రెండవసం॥రం మరి రెండు స్థాపింపబడతాయి అని వివరించారు.

శిశుసంక్షేమ సంఘ సభ్యులకు రాష్ట్రపతి శ్రీ రాజేంద్రప్రసాదుగారు 16—5—61 సాయంకాలం రాష్ట్రపతిభవనంలో అల్పాహారపు విందు జరిపారు.

1961—'63లకు శిశుసంక్షేమసంఘానికి ఈక్రిందివారు కార్యనిర్వాహకులుగా ఎన్నుకోబడ్డారు:—

శ్రీమతి— ఇందిరాగాంధి (అధ్యక్షురాలు);— శ్రీ రాధారామన్; శ్రీమతి— దుర్గాబాయిదేశముఖ్; శ్రీమతి— హన్నా మెహతా; (ఉపాధ్యక్షులు);—శ్రీమతి పుష్పా మెహతా; (కార్యదర్శి)— శ్రీ— యం. యస్. భాట్‌నగర్ (కోశాధిపతి).

సాహితీసుందరి

"సాధుశ్రీ"

భావాబ్ధిని
పవనమ్మెదొ
వీచినదేమొ
వడినడిగను
సుడులు లేచి
పడుచు రేగె ... ...
....
... ...
"కవితాలోకమ్మున
కవితాకుమారిక
కెమ్మోవిసుధల
తమిదీర గ్రోలెదు
ఏమోయి ఓకవీ?
అమరుడ వయ్యెదొ?
లేక నీదాహమ్ము నదె
పోకార్చునె ఏమి?
నీవూహాసుందరి
నయననీలోత్పలముల
నీలంపువెలుగులను
వెలిగించెదు దివ్వెలను
బాహ్యతిమిరమును
స్వాహా చేయగల్గుదె?
ప్రేయసి నెమ్మెని
సోయగమ్ముల
కడుపార మేసెదె?
ఉడుగునె నాక్షుధ?
నీభావభామిని
శోభా సౌరభముల
చందనమ్ముల న
లందెదవు నెమ్మెనికి
దుర్గంధముల
నిర్గమించుటకేన?
సాహితీసుందరి
స్నేహభాషణములె
వీణాక్వాణములని
వినుతింతువుగద?
పోకార్చునటయ్య
ప్రకృతి నిశ్శబ్దతను!
ఎందులకోయి యీక్షోభ
ఎందులకే వృథాశోభ
వదలుమయ్య నీసాహితీ
సుందరిని స్వప్నములనె.

బాలవినోదం :

చక్రవర్తి పదవి పొందిన బెస్తవాడు

బాలలూ! చీనా దేశపుకథను ఒకదాన్ని చెబుతా. అది చాలావిచిత్రంగా ఉంటుంది. వింటారు కదూ!

పూర్వం ఆ దేశంలో 'పావో'-అనే బెస్తవాడు ఒకడు ఉండేవాడు. అతని తండ్రిపేరు 'మావో'. పావో దగ్గరఉండే నదిలో చేపలుపట్టి జీవిస్తూ ఉండేవాడు. కాలం గడిచేకొద్దీ అతడు ముసలోడు అయ్యాడు. జబ్బుతో మంచంలో పడ్డాడు. ఇక చాలాకాలం తాను జీవించనని తెలుసుకున్నాడు. ఏలాగూ అతడి కడపటిగడియలు సమీపించాయి. అప్పుడు అతడు తనకొడుకును దగ్గఱికి పిలిచి, "చిట్టినాన్నా! నేను ఇంక చాలాకాలం బ్రతకను. నాఅనంతరం నీవు నాఆజ్ఞప్రకారం మూడువిషయాల్ని మరవకుండా మనస్సులో పెట్టుకొని నీజీవితాన్ని గడపాలి. మొదటిది మన చక్రవర్తికి లోబడి నడవాలి. రెండోది, మనచేపలవలనే ఆశ్రయించుకొని నీబ్రతుకు సాగించాలి-మూడోది, మిక్కిలి ముఖ్యం అయింది సుమా! మంత్రశక్తిగల విచిత్రమైన పళ్లెంఒకటి మనయింట్లోఉంది. అపళ్లేన్ని (ఈ మన చీనా దేశపు సముద్రాల వరకు ఎక్కడా దొరకని ఒక అద్భుతమయిన చేతిపనితనం గలదాన్ని) అప్పటి మన దేశ ప్రభువుఅయిన 'హాన్' అనే చక్రవర్తి మన పూర్వీకులలో ఒకాయన అర్పించిన (మంచి)బంగారు చేపనుచూచి సంతోషించి, బహుమానంగా ఇచ్చాడు. దాన్ని భద్రంగా కాపాడుకోవాలి. అదే నీకు ముందుముందు గొప్ప అదృష్టాన్ని కలిగిస్తుంది. భగవంతుడు నీకు అండదండగా ఉండి రక్షించునుగాక" అని కొడుక్కి హితోపదేశంచేసి ముసలి 'పావో' కండ్లు మూశాడు.

'కోలింగు' తండ్రి చెప్పినప్రకారం అక్షరాలా నడుచుకొంటూ, పెద్దలమార్గాన్ని అనుసరించి జీవితం వెళ్లబుచ్చసాగేడు. వాడు ఎప్పుడో ఒకప్పుడు తాను భాగ్యవంతుడు కాగలనని ధైర్యంతో రోజులు నెట్టుకొస్తున్నాడు. అలాఉండగా, ఒకానొకదినం సముద్రంలోని చేపల్లో ఒక్కటికూడా అతడివలలో పడింది కాదు. అతడు చింతిస్తూ ఆసముద్రం ఒడ్డున ఉండే తనగుడిసెకు వచ్చి చేరాడు. ఏమిచేయటానికి పాలుపోక ఒకమూల కూచుని ఎంతో దీర్ఘాలోచన చేయటంలో, తనతండ్రి చెప్పిన పళ్లెంమీదికి అతనిబుద్ధి మళ్లింది. వెంటనే, చాలాదినాలుగా, (ఉన్నచోటినుండి కదలకుండా ఉండిన) ఆపళ్లెం దాచబడిన రహస్యప్రదేశానికి వెళ్లి దాన్ని తీసుకున్నాడు మళ్లా దానిస్థలంలోనే దాన్ని బాగా శుభ్రంగా కడిగి భద్రపరుస్తామని అతనికి తోచింది. అప్పుడు నీటితొట్టిలో దాన్ని మురికి పొయ్యేటట్టు కడగగానే అందులో మిక్కిలి పసందయిన చిత్రలేఖనాలు నానావర్ణాలతో కనబడినాయి. ఆచిత్రాలు వృక్షాలు, భవనాలు, పక్షులు, చేపలు మొదలయినవాటికి సంబంధించినవి. అవి "హాన్" అనే చక్రవర్తికాలంలో ప్రఖ్యాతివహించిన 'కియోషీ' అనే చిత్రకారుడిచే చిత్రింపబడినవి. కాని 'కోలింగు' ఆవిషయాన్ని యెఱుగడు.

'కియోషీ' చిత్రకళానైపుణ్యానికే మహదానందంతో ఆశ్చర్యపడుతున్న కోలింగుకు అంతకంటెకూడా హృదయాన్ని కదల్చివేసే పరవశత్వం అద్భుతం కలిగించేవిషయం మరోటి సంభవించింది. నీటితొట్టిలో కడిగేటప్పుడు పళ్లెంనించి చేపలు దిగజారి నీళ్లలోపడి నిజమయిన చేపలు ఈదులాడేమోస్తరు ఈదుటకు పూనుకున్నవి. అతడు చిన్నచిన్న చేపలను చేత్తో పట్టుకొని తబుకులో మళ్లాపెట్టాడు. వెంటనే ఆమత్స్యాలు

ఎప్పటిమాదిరి మరల చిత్రలేఖనాలుగా మారి పోయినాయి.

'కోలింగు' ఈవింతను చూచి తనకన్నులను తానే నమ్మలేక మళ్ళా పళ్లెం రెండుమూడు సారులు కడగటం నీళ్లలోపడ్డ చేపలు సజీవాలు కావటం, తట్టలో పెట్టినప్పుడు చిత్రరూపాలుగా మారటం జరుగుతూవచ్చింది. ఎంతటి అద్భుతం ఇది!

ఆపళ్లేన్ని ఏమిచేయాలోతోచకుండ కోలింగు ఆశ్చర్యపడుతూ దాన్ని ఈవంక ఆవంక త్రిప్పి త్రిప్పి చూస్తూ వింతగొలిపే ఆతబుకు రహస్యాన్ని కనుక్కోవాల్నని ఎంతో ప్రయత్నం చేశాడు; కాని సాధ్యపడలేదు. ఇంతలో నిర్విణ్ణుడయిన అతనిచేతినుండి విలువగల ఆతట్ట జారిపడి తునాతనకలయినాయి. దాన్నిచూచి కోలింగు పొందిన దుఃఖానికి అంతులేదు. ఆప్రకారం ఆ పళ్లెం పగిలిపోవటం తనదురదృష్టానికీ, తనకు గలుగనున్న దురవస్థకీ ఒక అశుభసూచనమని అతడు భావించాడు!

ధారావాహినిగా కారే కన్నీటితో, వర్ణించటానికి వీలుకాని మనోభయంతో ముక్కలన్నిటినీ ఏరి మరలా తట్టమోస్తరుగా అమర్చటానికి పూనుకొన్నాడు. అతడు ఆ కష్టతరం అయిన కార్యంలో నిమగ్నుడయి ఉండగా, ఒక పగిలినముక్కమీద, తాను అదివరకు ఎప్పుడూ చూడని ఒకవృక్షంయొక్క చిత్రరచన కనబడింది. దాన్ని చూచి అతడు సంతోషిస్తుండగా, ఒక క్రొత్తఆలోచన అతనికి తట్టింది. 'తట్టలోని చేప' నీళ్లలో ఈదనేర్చినపుడు ఈతబుకు ముక్కను నాటి నీళ్లుపోస్తే ఎందుకు పెరగదు?' అని అనుకొని అతడు తనగుడిసెకు వెనుకతట్టున్న కాళీప్రదేశంలో ఒకమూల నేలను త్రవ్వి చెట్టు చిత్రం ఉండే పగిలిన పళ్లెమ్ముక్కను లోతుగా, విత్తనం నాటేవిధంగానే నాటి నీళ్లు పోస్తూ వచ్చాడు. మిగిలిన తబుకు తునకల్ని అతడొక మూటగాకట్టి మునుపటి రహస్యస్థలంలోనే దాచిపెట్టి, అనుదినము తాను నాటిన మ్రాని చిత్రలేఖనపు ముక్కయొక్క పరిణామాన్ని నిరీక్షిస్తూ ఉండినాడు.

ఐదవనాడు అతడికొక ఆశ్చర్యకర మయిన దృశ్యం కనబడింది. పగిలిన ఆచైనాపళ్లెపుముక్క నేలను చీల్చుకొని సూర్యకిరణాలు ప్రసరించే వైపుకు ఒక మొలక బయలుపడింది. అది కోలింగును ఆకర్షించింది. దానికి అతడు అనురాగంతో నీళ్ళుకట్టేడు. తనలో తాను 'వింత అయిన యీచెట్టుపండు ఎలాంటిదో? ఎట్లు ఉంటుందో?' అని అబ్బురపోయినాడు. ఆ మొలక చాలాత్వరితంగా పెరుగుతూ కొమ్మలు, రెమ్మలు వేయసాగింది. కొన్ని యేండ్లకుగాని చెందని అభివృద్ధిని అది కొన్ని వారాలలోనే చెందగలిగింది. శాఖోపశాఖలుగ పెంపొందిన ఆచెట్టు కొన్నాళ్లకు కోలింగు గుడిసెనుగూడ ఆవరించింది. ఆ కుటీరం ప్రేక్షకులకి కనబడనంత దట్టంగా అన్ని దిక్కులా ఆవృక్షం వ్యాపించింది.

సకాలమునకు ఆమ్రాను వింతనుగూర్చే ఫలాల్ని ఇయ్యగలదని కోలింగు అభిప్రాయపడ్డాడు. అలాగే జరిగిందికూడ. ఆచెట్టుపండ్లు మిక్కిలి ఎఱ్ఱనివి. ఇక వానిమాధుర్యం చైనాదేశంలోని మరేపండుకూలేదు. వానికి ఎట్టి పేరుతగునో కోలింగు బుద్ధికి తోచనందున కొందరి సలహాలను అనుసరించి, వానిని అమృతఫలాలనీ, చెట్టునకు కల్పవృక్షమని పేర్లుపెట్టేడు.

అమృతఫలప్రఖ్యాతి దేశంలో నాలుగుమూలలకు వ్యాపించింది. అది చక్రవర్తిగారి చెవిని పడటానికి ఎంతోకాలం పట్టలేదు. తెలివిగల వ్యాపారస్థుడు ఒకడు ఈవిషయం తెలుసుకొని కోలింగువద్దకు వెళ్లి నూఱువెండినాణేలకు నూరు పండ్లు బేరమాడితీసికొని, సార్వభౌముని దర్శించి, ఆయనకొకఫలాన్ని నూరువెండి నాణేలచొప్పున విక్రయించాడు.

చక్రవర్తి తాను డెబ్భైఅయిదేండ్లుగా రాజ్యపరిపాలనం చేస్తూవుండినా, అలాంటిరుచ్యములైన పండ్ల నెప్పుడు తినియుండలేదని చెబుతూ, దాని పుట్టుపూర్వోత్తరాలనుగూర్చి వివరంగా తెలుసుకొన్నాడు. అవి తనరాజ్యంలోనే జీవిస్తూ, తన పౌరులలో ఒకడుగా వర్తిస్తూ వుండే బెస్తవాని యింటిదొడ్లో ఉన్న చెట్టువి-అని యెఱిగినతరువాత మహదానందం పొందేడు. వెంటనే ఆ చక్రవర్తి అద్భుత ఫలాల్ని యిచ్చే వృక్షాన్ని చూడదలచి తనపల్లకిలో బెస్తవాని ఇంటికి బయలుదేరాడు. ప్రజాసమూహం వెంటాడగా వచ్చు సార్వభౌముని పల్లకిని అల్లంతదూరాన్నే చూచి కలవరం పొందాడు. తనకేదో విపత్తు రానున్నదని అభిప్రాయపడ్డాడు. కాని, చక్రవర్తి అతని కుటీరంవద్ద పల్లకినుండి దిగి, అతనితో ప్రేమపూర్వకంగా మాటాడడంతో ఆభీతి తొలగిపోయింది.

అందరితోబాటు వచ్చిన వ్యాపారస్థుడు, తాను ఎవరివద్ద అమృతఫలాలనుకొన్నాడో, ఆకోలింగును ప్రభువుకు పరిచయంచేశాడు. అప్పుడు సార్వభౌముడు, కోలింగునుచూచి, "కుమారా, పావో, విస్మయంకలిగించే నీకల్పవృక్షం పండ్లు మాకు చాలఆనందాన్ని చేకూర్చింది. అయితే, ఈలాంటిగొప్పవృక్షం మా ఉద్యానవనాన్ని అలంకరిస్తే, యింతకంటె శోభాయమానంగా ఉంటుంది. చూచేవాళ్ళుఆనందిస్తారు. ఇది యిలాంటి నిర్జన ప్రదేశంలో విసరివేసినట్లుండే మారుమూలలో ఉండతగిందికాదు. కనుక నీవు దీన్ని మాకిచ్చేపక్షంలో నీకు కలిగేనష్టానికి ప్రత్యామ్నాయంగా సంవత్సరానికి అయిదువేల వెండి మొహరీలు ఆదాయంవచ్చే మండలాన్ని అన్ని హక్కులతో స్వతంత్రంగా పాలించుకొనే సామంత రాజపదవిని అర్పిస్తాము."

కోలింగు కొంతసేపు తటపటాయించాడు. ఆ సమయంలో అతనికి తనతండ్రి చనిపోతూ చెప్పిన మాటలు జ్ఞప్తికివచ్చాయి. మిక్కిలిఅణకువతో చక్రవర్తినిచూచి యిలా చెప్పాడు. "మహాప్రభూ, యీ అసమర్థుడయిన తమభృత్యానుభృత్యుడీవృక్షాన్ని తన స్వాధీనంలో ఉంచుకొనుటకు అనర్హుడయినా, సర్వజ్ఞులగు తమసన్నిధిలో నేను దీనిని అర్పించుటకు వీలుకాదని చెప్పుటకు జంకుతున్నాను."

చక్రవర్తి కోలింగుమాటలకు ఆనందభరితుడై కోలింగు ఇంటిదొడ్డిలో ఉన్న ఆకల్పవృక్షాన్ని తనసౌధానికి తీసుకవెళ్లి నాటుకోవటానికి అనుకూలించునేమో అని పరిశీలించాడు. ఇలా దేశాధిపతి పరికిస్తూ, ఆచెట్టునీడను నిల్చుకొని యేదో ఆలోచనలో పడడమే తడవుగా, ఆ చెట్టు గుర్తయినా లేకుండా సమూలంగా అదృశ్యం అయింది. అపుడు కోలింగు ఆతట్టనుగూర్చిన వృత్తాంతమంతా పూసగ్రుచ్చినట్లు వివరించి చెప్పాడు. అంతా విన్నతర్వాత చక్రవర్తి ఇలా సెలవిచ్చాడు:—పూజ్యుడైన మా వంశస్థుడు 'హాఙ్' చక్రవర్తి అనుగ్రహించినదానిని మేము తీసికొంటే అది దత్తాపహారమనే గొప్పపాపానికి ఒడిగట్టినట్లు అవుతుంది. పెద్దలయిన గ్రంథకర్తలు ఇలా చెప్పారు: 'ఎవడయితే, తాను మనఃపూర్వకంగా దానమిచ్చిన వస్తువును మరలా అపహరిస్తాడో వాడు, వాచా దానంచేసినదాన్ని బొత్తిగా నిరాకరించేవానికంటె, ఎక్కువ పాపానికి ఒడిగట్టినవాడని భావించాలి'. వివేకవంతుడును తనపూర్వికుడును అయిన 'హాఙ్' చక్రవర్తి ఇచ్చినదానాన్ని (బహుమానాన్ని) 'వాంగ్' చక్రవర్తి హరించాడనే అపఖ్యాతి రాకూడదు. ఆతటుకును, దానినుండి కలిగే వస్తువులును నీ యొద్దనుండి ఎవ్వడును తీసికొనజాలడు. మేమిదివరకే వాగ్దత్తం చేసినట్లు నీవు 'క్వాంగ్ సి' మండలాన్ని ఏలుకునే సామంతరాజువు. ఏటేట మాకు 5 వందల అమృతఫలాల్ని కప్పంగా చెల్లించాలి. దేవతలు నీకు నిరంతరసౌఖ్యసంపదలు అనుగ్ర

హింతురుగాక!'' అని కోలింగును దీవించి ప్రభువు తనపరివారంతోకూడా రాజసౌధానికి దారి తీశాడు.

కోలింగు రాజాధిరాజు ఆజ్ఞాపించినరీతిగా సామంత మండలేశ్వర పదవిని పొందాడు. అతడు తన అధిపతి అంగీకరించిన చట్టాలకు బద్ధుడై న్యాయాన్ని పాలిస్తూ తెలివితో రాజ్యపరిపాలనం చేయసాగేడు. పవిత్రదినాల్లో జ్యోతులు వెలిగించి దేవుని ఆరాధిస్తూవచ్చేడు. తన తాత తండ్రులతరంనుండి ఆనువాయితిగా వస్తూన్న కులవృత్తిని వదలకుండా విరామకాలంలో చేపలు కూడా పడుతూవుండేవాడు. అతడు అన్యులకెవరికీ తనరాజ్యంలో తావుయిచ్చేవాడుకాడు; చక్రవర్తి యెడల అమితరాజభక్తితో ప్రవర్తించేవాడు. అతడికితప్ప కోలింగు తనజీవితంలో మరెవరికీ లొంగినవాడుకాడు. ఈవిధంగా కొన్నియేండ్లు గడచిపోయినపిదప ఒకానొకదినం ఒక ప్రదేశంలో ఉత్పత్తిఅయ్యే సరుకులను మరొక ప్రదేశానికి తీసుకువెళ్లి వ్యాపారంచేసే సార్థవాహులు కొందరు కోలింగురాజధానికివచ్చారు. వారు "సార్వభౌమునికుమార్తె 'లైలో' (చంద్రముఖి) అనేకన్య వింతఅయిన తీవ్రవ్యాధితో బాధపడుచున్నది; విశాలమయిన సార్వభౌముని రాజ్యంలో ప్రఖ్యాతివహించిన వైద్యశిఖామణులందరూ ఆమెరోగమును పరిశీలించిచూచి, అది కుదురునది కాదని నిశ్చయంచేసుకొన్నారు.'' అనే వార్తను తెచ్చారు. అది కోలింగుకుసు తెలిసినది. అతడు అంతకుముందే ఆరాజపుత్రి లోకోత్తరసౌందర్యరాశి అని వినియున్నాడు. కాన, ఆమెను ఎట్లయిన సందర్శింపవలెనని తీర్మానించుకొన్నాడు. అప్పుడతడా రాకుమారికి తగిన బహుమాన మేదయిన తీసికొనిపోవ నిశ్చయించుకొన్నాడు. గొప్పవారికడకు వట్టిచేతులతో పోరాదని పెద్దలనటం అతడు అనేకపర్యాయాలు విన్నాడు. వెంటనే పగిలిపోయిన చైనాతట్టముక్కల మూటమీదికి అతడిబుద్ధి మళ్లింది. ఆ తునకలను పరీక్షించటంలో అందమయిన పుష్పచిత్రంగల పెంచికఒకటి అతనికంట పడింది. అలాటి పూవుసు అదిపరకు అతడెన్నడూ చూడనూలేదు; విననూలేదు. "అచ్చంగా ఈలాటి మనోహరమయిన పుష్పం కానుకగా నేను ప్రభుపుత్రికి సమర్పిస్తే, ఆమెకు నాయందు సదభిప్రాయం కలగడానికి అవకాశం ఏర్పడుతుంది. సార్వభౌముడుకూడా చాలాసంతోషిస్తాడు'' అని భావించి, తట్టను తనయింటిదొడ్లోకి తీసుకొని వెళ్లినాడు. కాని, అది ప్రకృతం ఆతనిగుడిసెదొడ్డి కాదు. బ్రహ్మాండమయిన ప్రమదావనం. అతనికుటీరంకూడా రూపుమాసింది. ఆచోట ఇప్పుడొక ద్వివ్యభవనం ఏర్పడింది. ఆక్రీడావనంలో కల్పవృక్షానికి సమీపంగా పుష్పచిత్రంగల తబుకుముక్కను పాతిపెట్టి, దానిపరిణామాన్ని నిరీక్షిస్తుకూర్చున్నాడు. ఆస్థలంలో అతడికి చెప్పరాని ఆనందం కలిగేటట్టు ఒక అందమయిన తీగెపయికి ప్రాకివచ్చి, మనోహరములగు నానావిధవర్ణములు గలిగి సువాసనలు వెదజల్లే పూలగుత్తులతో ప్రకాశించింది. అందలి పుష్పముల యింపయిన సుగంధము భూలోకంలో మరేపుష్పమునకుసు లేదనుట నిస్సంశయము. కోలింగు తనకు కావలసినన్ని పూలను ఏరుకొని, వాటితోబాటు తాను సార్వభౌమునికి చెల్లింపవలసిన వార్షికపు కప్పముగు 500 కల్పవృక్ష ఫలాలనుకూడ తీసికొని నగరమునకు వెడలి రాజభవనం ప్రవేశించాడు. అతనిరాకసు తెలిసికొన్న చక్రవర్తి ఎదురుగా వెడలి అమితానురాగంతో స్వాగతమిచ్చి, తన కుమార్తె వ్యాధితో శయనించియున్న గదిలోనికి తీసికొని వెడలినాడు. ఆకన్యారత్నం పాలిపోయిన ముఖంతో శుష్కించిన శరీరంతో అమిత కష్టం మీద వచ్చుచున్న ఉచ్ఛ్వాసనిశ్వాసములతో నీరసంగా పాన్పుపై పడియుండటాన్ని కోలింగు చూచాడు. అతడు తనతో తీసికొనిపోయిన

పుష్పాల పరిమళం ఆగది అంతా వ్యాపించి రాకుమారి విషయంలో అద్భుతంగా పనిచేసింది. బలహీనురాలై కొన్ని వారాలుగా పడకమీదినుండి కదలటానికికూడ వీలుకాని స్థితిలో ఉండిన ఆ యువతి తటాలున లేచి కూర్చుండి చిరునవ్వు నవ్వింది. తన కూతురు ఆ మోస్తరు జీవకళతో ప్రకాశించడం చూచి ప్రభువు ఆనంద పరవశుడై ఆమెలో అట్టిమార్పు కలగడానికి హేతువయినది కోలింగు రాకయే అని భావించి అతనిని తనపుత్రికి పరిచయపరచి అతని గుణాలనుగూర్చి పలువిధాల కొనియాడినాడు. కోలింగు చక్రవర్తి వాక్యాలను విని వినయ విధేయతలతో, ఆ రాజతనయ కోసం తెచ్చిన పుష్పాలను ఆమెకు నజరుగా సమర్పించాడు. ఆ కుసుమాల సౌకుమార్యానికి ఆమె ఎంతో ముగ్ధురాలై తదేక దృష్టితో మహదానంద వివశురాలై చాలసేపు చూచింది. తన ఱొమ్మునకు వానిని అదుముకొన్నది. తన మృదువులైన పెదవులతో వాని మెత్తని రేకులను ముద్దుపెట్టుకొన్నది. వానిని పలుమారు వాసన చూస్తూ ఉండటంవల్ల కొంతసేపటికామె పాలిపోయిన చెక్కిళ్లు ఎరుపెక్కినాయి. సార్వభౌముడివన్ని చూచి అంతులేని సంతోషాన్ని పొందాడు. ఆ ప్రభుకుమారి తనకాపూలను తెచ్చి యిచ్చిన కోలింగునకు కృతజ్ఞతాభివందనాలు చెల్లించింది. ఆ పూలను ఆమె 'అమృత'మని తృప్తిగా పేర్కొంటూ, కోలింగును చూచి 'కోలింగ్,' ఈ దేవలోక పుష్పాల్ని నీ వెక్కడ సంపాదించావు? ఇవి దొరికే పవిత్ర స్థలం ఎక్కడఉన్నది? ఇక్కడ ఉద్యానవనాల్లో దీనిని తెచ్చి అలంకరింప చేయటానికి సాధ్యం అవుతుందా?' ఇలా, ఆ పూల వృత్తాంతం తెలుసుకోవటానికి ఉబలాటపడే చక్రవర్తి పుత్రికకి కోలింగు పూల విషయాన్ని సంగ్రహంగా చెప్పాడు. అంతేగాక 'హాన్' చక్రవర్తి చేత కానుకగా ఇవ్వబడిన అద్భుతమయిన పళ్లెంచిత్రకూడ ఆమూలాగ్రంగా వివరించాడు. అంతా విన్నతరవాత రాకుమారి, ఆ పూలచెట్టును తమ ఉద్యానవనంలో నాటి పెంచుకోవాల్నే ఉద్దేశం కోలింగుకి తెలపడంవల్ల ఫలంలేదని నిశ్చయించుకొన్నది. అప్పుడు మిక్కిలి వివేకవంతుడైన రాజాధిరాజు తనకూతురి ఉద్దేశం, కోలింగు సంశయం తీరేటట్లు ఇలా చెప్పాడు. బిడ్డా, విచారపడకు. ఈ సమస్య ఏమంత గడ్డుసైనదికాదు. పెద్దలు ఇలా చెప్పారు. ప్రపంచంలో కొన్ని కష్టాలు లేకపోలేదు. తెలివిగలవారుకూడ వానినుంచి బయటపడేమార్గాన్ని కనుక్కోలేకుండా ఉన్నారు. మన ఈ కష్టమయిన సమస్య సులభంగానే తీరేమార్గం ఉన్నది. నీవు కోలింగును పెండ్లాడు. అప్పుడు అతడు కల్పవృక్షాన్ని దీని పుష్పాల్ని మన రాజసౌధంలోని ప్రమదావనంలో స్థాపించి అలంకరింపజేస్తాడు.

ప్రకృతం రాజకుమారి తన యిష్టాన్ని తెలపాల్సి ఉంది. అందుకామె పూనుకోగానే సిగ్గుతో ఆమె చెక్కిళ్లు ఎఱ్ఱబడ్డాయి. కోలింగు చాలఅందగాడు. పుట్టుకచేత అతడు బెస్తవాడయినా దాన్ని సూచించే లక్షణాలు కొంచెంకూడ అతడిలో ఇప్పుడు కనిపించటంలేదు. కాన అతణ్ణి వివాహం చేసుకోవటానికి ఆమె బహిరంగంగా తన అభిప్రాయాన్ని తెలిపింది. తరవాత కొంతకాలానికి 'వాంగ్' చక్రవర్తి తన పెద్దల్ని కలుసుకున్నాడు. కోలింగు రాజ్యానికి సార్వభౌముడయ్యాడు. విశాలమయిన చైనా రాజ్యాన్ని అతడు చాకచక్యంతో ఏలేడు. ఎవ్వరికీ దారిద్ర్యం దుఃఖమనేది వారిపొంతలలోకూడా చేరవచ్చేదికాదు. అక్రమంగా పన్నులెక్కువ వసూలుచేయబడటంలేదు. నిఱుపేదలకు న్యాయం చేకూర్చటంలో ప్రభుత్వం శ్రద్ధ వహించింది. వారిని అనురాగంతో చూస్తూ సంఘంలో తక్కినవారికి చూపే గౌరవమే చూపుతూవచ్చింది.

క్వాంగ్సీ రేవు ప్రదేశాల్లోఉండే బెస్తలు ఋజుప్రవర్తనకలిగి చక్రవర్తిపదవిని అందుకొన్న ఈ కోలింగు కథని సగర్వంగా ఇప్పటికిగూడా చెబుతూంటారు.

ANDHRA MAHILA SABHA

NURSING HOME & NURSES' TRAINING CENTRE

Statistics for the Month of April 1961.

OUT-PATIENT REGISTER:—

No. of Medical cases treated		524
„ „ Surgical „ „		29
„ „ Post-natal „ „		43
„ „ Ante-natal „ „		225
„ „ Gyneac „ „		134
„ „ Dental „ „		5
„ „ E.E.N.T. „ „		33
Total „ „ New Patients Treated		9,93
„ „ „ Old „ „		1,053
	Grand Total	20,46

IN-PATIENT REGISTER:—

No. of Patients admitted for Normal Deliveries		96
„ „ „ „ „ Abnormal „		
Forceps	5	8
I. P. Version	1	
Breech Ext.	1	
M. R. Placenta	1	
„ „ Ante-natal False Pains cases treated		23
„ „ Ante-natal c Toxeamia „ „		1
„ „ Post-Natal cases treated		2
„ „ Gyneac „ „		21
„ „ Surgical „ „		2
„ „ Medical „ „		7
„ „ Babies admitted as Lodgers		105
	Grand Total	265

(True Copy)

(Sd.) Dr. K. R. AMBUJA
Resident Medical Officer.

(Sd.) Dr. M. PAVANA BAI,
Medical Superintendent.

Smt. V. LAKSHMI PARVATI.
Secretary.

“రాధ”

శ్రీ “సారథి”

“టెలిగ్రాం సార్” అన్న కేక విని త్రుళ్లిపడి రాధ టెలిగ్రాం అందుకుని, కవరుచించి, చదివి “అయ్యో”అని గావుకేకపెట్టి నేలపై చతికిలపడి ఇలా వాపోవ నారంభించింది.

“భగవాన్— ఎందు కీవిషపరీక్ష? నేనేం అపకారం చేశానని నన్నింకా పరీక్షిస్తున్నావు. నా ఒక్కదాని సుఖంకోసం సర్వస్వం త్యజించడానికి సిద్ధంగావున్న, నాకుమారుడిప్రాణాలు అన్యాయంగా తీశావు. నావంశవృక్షాన్ని నిర్మూలనం చేశావు. ఎందుకు స్వామి వాడిప్రాణాలు తీశావు? అసలు వాడేంఅపకారం చేసాడని, ఇంతనిర్దాక్షిణ్యంగా, నిర్దయగా ప్రవర్తించావు. అసలు నీకు ప్రాణాలే ప్రధానమైతే నాప్రాణాల నర్పించడానికి నేను సిద్ధంగా వున్నానే. ఇప్పటికే నాజీవితంతో చాలసార్లు చెలగాటమాడావు. నేను మాతృగర్భంలో వుండగానే, తండ్రిని మ్రింగిన పాపినని, ఇప్పటికీ లోకం కోడై కూస్తుందే. నాజీవితంలో ఇంతవరకు నేను ఒక్క చిరునవ్వు నవ్వడానికి నోచుకోలేదే. నాతల్లి ఎంతో కష్టపడి నన్ను పెంచి, పెద్దదానినిచేసి, నేనేదో సుఖపడ్తానని ఒకరిచేతిలో నన్నుంచి సంతృప్తిపడింది. కాని ఆసంతోషం అట్టే అన్నిరోజులు నిలవక పోయిందికదా! వివాహమైన రెండుసంవత్సరాలలోనే మాఆయన రైలుప్రమాదంలో “నలుగురితోపాటు నారాయణ”గా పోయారే. నాఅవస్థను చూచి కుమిలి కుమిలి ఏడ్చి తానేదో పాపంచేశానని బాధపడి తల్లడిల్లిందే నాతల్లి. ఆమెహృదయం ఎంతగా క్షోభించిపోయిందో? ఆబాధతోనే ఆమె జీవితంకూడ గడచిపోయిందికదా! మిగిలిందల్లా నాకు ఈఒక్కగా నొక్క కుమారుడేకదా! వాడిని చూచుకుని మురిసిపోయానే ఇన్నిరోజులు. వాడిపై ఆశలు పెట్టుకుని వాడింతవాడవుతాడు, నన్నుద్ధరిస్తాడని ఎన్నో తియ్యటికలలు కన్నానుకదా! కాని నాఆశలన్నీ హారతికర్పూరంలా హరించుకుని పోయిందే.

నాసానుభూతి పరులందరు ఇంతవరకు అదేపనిగా “రాధా! ఇక నీవు బాధపడవలసిన అవసరంలేదు. చెట్టంతవాడయ్యాడు నీకుమారుడు. పాపం ఎన్నో శ్రమలకోర్చి, పెంచి పెద్దవాడిని చేసి వృద్ధికి తీసుకొచ్చావు. వాడి ఆసరాలో నీకింకేం లోటుండదు. ఇక నీజీవితం సాఫీగా నడుస్తుందిలే” అని అన్నారే. వాళ్ల మాటలు ఇంకా నాచెవులలో రింగుమంటున్నాయి. ఇంతలో ఈ“చావుకబురు చల్లగా” వచ్చిందే. ఈ నా బాధ భరించలేకపోతున్నా.. ఇంతకంటె నాపై పిడుగుపడినా సహించి ఓర్చుకొనేదానిని. వాడికి పెళ్లిచేసి చూడాలన్న ఆసక్తితో నావ్యూహాలలోనే వాడిపెళ్లి ఏర్పాటులు చేశానుకదా! వాడికిష్టమైన ఆమూడోఇంటి సుశీలను నాకోడలుగా స్వీకరించ ఇష్టపడ్డానే; కాని నా వ్యూహ సౌధాలు అంతా, ఒకత్రుటిలో ఇలా కూలిపోయిందే. ఇక నాజీవితం వ్యర్థం. ఎందుకు నేనింకా జీవించాలి? జీవించి సాధించాల్సిందేముంది? ఈ నా పాపిష్టికళ్లతో వాడి మృతదేహాన్ని చూడలేను ప్రభూ— వాడిదేహం, నాకళ్లెదుట పడడానికి మునుపే, ఈ నా దౌర్భాగ్యపు జీవితాన్ని చాలించుకోవలసిందే! లేకుంటే ఆజన్మాంతరం ఈహృదయతాపంతో ప్రతినిమిషం మనస్సుతో మారణయుద్ధం చేయాల్సివస్తుందికదా! ఇంతవరకు నాజీవితం ఇలా అమర్చినందుకు “ప్రభూ— ఇదిగో శ్రద్ధాంజలి అర్పిస్తున్నా. తీసుకో”— రాధ వెంటనే ఏదో నిశ్చయానికి వచ్చినదై, గంపెడుదుఃఖాన్ని మ్రింగి, పెరటిలోనికి దారితీసి, సరాసరి నూతిదగ్గరకు వెళ్లి, భగవంతుని మరొక్కసారి ధ్యానించి, పడపోయింది.

ఇంతలో “అమ్మా” అన్న చల్లని పిలుపువిని, నిశ్చేష్టురాలై నిల్చిపోయి “ఏమిటీ— నాశేఖరం గొంతుకలా వుందే— నేనొకవేళ కలగంటున్నానా” అని యోచించడంలో, శేఖరం రానేవచ్చాడు. వాడిని చూడ్డంతోటే, ఆతల్లి, ఆనందంతో వాడిని తృప్తిగా హృదయానికి గాఢంగా హత్తుకుని, నుదుటిని దీర్ఘంగా ముద్దిడింది.

“అమ్మా— ఏమ్మా— ఏంజరిగింది— నీవేదైనా పీడకల కన్నావా. అసలు ఇక్కడ నిల్చొని నూతిలో ఏంచేస్తున్నావమ్మా?” అని శేఖరం అన్నాడు.

“నాయనా— శేఖర్—ఇదిగో ఈటెలిగ్రాం చూడు. దీనిని చూడ్డంతోటే నాహృదయం ఎంతగా బాధపడిపోయిందో తెలుసా. నీవొక్కడిపైన నేనెన్నో ఆశలు పెట్టుకునియున్నానే. ఇప్పుడు నిన్ను చూడ్డంవరకు, భగవంతుడు నన్ను మోసంచేశాడని, ఆదై

వాన్ని నిందించానే. కాని అలాటిదేది జరగలేదు. నిజంగా ఇప్పుడు నామనస్సు కుదుటపడింది. రా–లోనికిరా! అపరమాత్ముడ్ని, క్షమించమని వేడుకుందాం" అంటూ రాధ లోనికి దారితీసింది.

ఇంతవరకు ఆటెలిగ్రాంను పరీక్షిస్తున్న, శేఖరం "అమ్మా– మాట ఇదిగో చూడు ఏతల్లికో వెళ్లాల్సిన టెలిగ్రాం నీకు అందింది. బహుశా, నేవస్తున్నానని పంపిన టెలిగ్రాం ఆతల్లికి చేరివుంటుంది. ఒకవేళ ఆతల్లి కుమారుడిపేరుకూడ, నాపేరుగానే వుంటే, అత నిరాకకొరకు ఇంతవరకు ఎదురు చూస్తుంటుంది–విషయం తెలిసినతర్వాత నీలాగా క్షోభిస్తుంది ఆమాతృహృదయం. నీవు కొద్ది ఘడియలు మాత్రం తహతహలాడిపోయావు. కాని ఇక ఆమె ఆజన్మాంతం జీవచ్ఛావంలా జీవించాల్సి వుంటుంది పాపం" కొన్ని సమయాల్లో, ఇలాటి చిన్నవిషయాలుకూడ, ఏలాటి విషమపరిణామాలకి దారితీస్తుందో చెప్పలేం" అంటూ ఆమాతృమూర్తిని అనురాగంతో హత్తుకుని లోనికి తీసికెళ్లాడు.

ఇద్దరు ఆనందంతో, అచంచలమైన భక్తితో, ఆదయామయుని మ్రొక్కారు. ఇప్పటికి రాధతృప్తిగా నవ్వింది. ఆనవ్వులో ప్రత్యేకంగా జీవం తొణికిసలాడింది.

న్యూఢిల్లీలో వేంకటేశ్వర కళాశాల

ఈ కళాశాల 1961 జూలై 15 తారీఖునుండి ప్రారంభం కాబోతున్నది. దీనికి "ఆంధ్ర విద్యాసంఘ పాఠశాల (The Andhra Education Society School) మూలబీజం. ఈ పాఠశాల 1948 సం॥న శ్రీమతి దుర్గాబాయిదేశముఖుగారిచే కొలదిమంది బాలబాలికలతో స్థాపించబడింది. అది ఈనాడు ఉన్నత మాధ్యమిక (Higher secondary) పాఠశాలగా పెంపొంది, 1,100 మంది బాల బాలికలకు విద్య నేర్పే గొప్ప సంస్థగా విరాజిల్లుతున్నది. ఈ విద్యాలయానికి ఆమెగారుమహాదాతలు, విద్యాభిమానులు, దేవాలయ ధర్మసంస్థలు మున్నగువాటిని ఆశ్రయించి భూరివిరాళాలు సమకూర్చి దివ్యభవనాన్ని నిర్మించింది. దక్షిణ భారతదేశస్థులయిన తలిదండ్రులకు ఢిల్లీ కళాశాలలలో ప్రవేశం లభించటం చాలా కష్టతరంగా ఉండటాన్ని గమనించిన ఆమె మనస్సున ఇట్టి పాఠశాల నెలకొల్పే అభిప్రాయాన్ని రేకెత్తించింది.

శ్రీమతి దేశముఖుగారు దక్షిణభారతదేశ వాసుల కలలు నిజమయ్యేటట్టు సర్వాంగసుందరంగా దిద్దితీర్చిన యీ విద్యాసంస్థను తగిన కట్టుదిట్టాలతో, ప్రకృతం అది ఒక కళాశాలగా పర్పడటానికి చేసినకృషి ప్రశంసనీయమయింది. ఇక దీన్ని ఢిల్లీ విశ్వ విద్యాలయానికి చేరదగిన గొప్పకళాశాలగా మార్చటానికి తగినసన్నాహంతో తిరుమల తిరుపతి దేవస్థాన ధర్మసంస్థ, ముందు నిల్చి పనిచేయ బూనుకొన్నందున క్రమేణ అది అన్ని విధాలా మంచిదశకు రాగలదు.

తిరుపతి దేవస్థాన ధర్మసంస్థ దీన్ని కళాశాలగా చేయటానికి ప్రస్తుతం 5 లక్షల రూపాయలు మంజూరు చేయటమేగాక, విజ్ఞాన (Science) శాఖ, శాస్త్ర (Arts) శాఖలలో విద్యలు, నేర్పగల తరగతులను, బాలబాలికలకు వసతి గృహాలను నిర్మించటానికి మరొక 9 లక్షల రూపాయలుకూడా ఇవ్వటానికి తీర్మానించుకొన్నది. దీనితో సమానమయిన మొత్తాన్ని యూనివర్సిటీ గ్రాంట్సు కమీషన్ మంజూరు చేయగలదు.

తాత్కాలికంగా ఈ కళాశాల ఇప్పటి పాఠశాలా భవనంలోనే జూలై 15 తారీఖునుండి శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన విద్యాబోధన కళాశాల (Sri Venkateswara College of Arts and Science) అనే పేరుతో ప్రారంభం అవుతుంది. ఇందు 300 బాల బాలికలకు విద్యాబోధన జరుగుతుంది. ఇప్పుడది శాస్త్రములు మాత్రమే బోధిస్తుంది! 'మోతిబాగ్' సమీపంలోని 15 యకరాల ప్రదేశంలో కళాశాలా ప్రత్యేకమందిర నిర్మాణాలు అయిన తరువాత విజ్ఞాన విద్యాశాఖలలో విద్యార్థులకు బోధన మొదలు పెట్టగలరు. క్రొత్త భవనాలకు 1961 ఆగస్టు 12 తారీఖున మన ఐక్యభారతానికి ఉపాధ్యక్షులయిన శ్రీ డాక్టరు, యస్. రాధాకృష్ణన్‌గారు శంకుస్థాపన చేస్తారు.

కళాశాల (15-7-'61) ప్రారంభించేనాటికి, ఆంగ్లం, తెలుగు, తమిళం, హిందీ, గణితశాస్త్రం. అర్థశాస్త్రం, రాజ్యాంగశాస్త్రం, భూగోళశాస్త్రం, సంఖ్యాపరిగణన శాస్త్రం, వీటిని పట్టభద్రత లభించే అభిమాన (Optional) శాస్త్రాలుగాను. ఆర్థిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం, ఆనరరీకోర్సులుగాను బోధనలు జరుగుతాయి.

('హిందూ'–21-5-'61)

బామ్మగారూ బూడిదగుమ్మడికాయలూ

"శ్రీమతి పవని నిర్మల ప్రభావతి"

అద్దంలో చూచుకున్నాను. నల్లజార్జెట్ చీరె, తెల్లటిక్రేప్ జాకెట్టూ, మెళ్లో సన్నజాజినెక్లెస్, అలంకరణ బాగా ఒప్పినట్టుంది నాకు!

"ఇంకా తెమలలేదమ్మాయ్? "అంటూన్న నాన్నగారి గొంతు ఇహలోకంలోకి లాక్కొచ్చింది నన్ను.

"వస్తున్నా!" అంటూ హాల్లోకి వచ్చాను.

ఒరేయ్ రామిగా! ఆసామానంతా బండిలో పెట్టు వస్తున్నా! "బామ్మ ఆజ్ఞ జారీచేసి ఎలిజెబెత్ రాణిలా బండికేసి నడిచింది.

"కానీరా! బండిపోనీ.... మళ్లా బస్సు పోతుందేమో!" అన్నారు నాన్నగారు.

"ఒరేయ్! ఒరేయ్‌సత్యం! ఏవీ? అవేవీ?" అంది బామ్మ కంగారుగా. చత్వారపుజోడులోంచి నిశితంగా బండంతా కలయజూస్తూ!

ఆ "అవి" ఏమిటో అర్థం కాలేదు నాకు.

"ఏమిటేఅమ్మా?" అన్నారు నాన్నగారు చిరాగ్గా.

"అవేరా! బూడిదగుమ్మడికాయలూ! ఇంతాచేసి అవి మర్చిపోతే ఎట్లాగూ?" బామ్మ ఉద్యేశ్యంలో "అవి" లేంది ఇకప్రయాణం దండగే ననిపిస్తోంది!

"ఇంతదూరంనుంచీ, బెంగుళూరుకు ఈబూడిదగుమ్మడికాయలు పట్టుకెళ్తావామ్మా? ఎవరేనా విన్నా నవ్విపోతారు!" నాన్నగారు కోపాన్ని లోలోపలే అణుచుకున్నారు!

"ఆకిట్టుగాడు "బూడిదగుమ్మడికాయ పడియాలో!" అంటూ కలవరించిపోయాడు. పోయినసారి వెళ్తే! వాడి భార్య గట్టిగా అడగలేక గాబోలు పాపం! ఊరుకుంది!" బామ్మ గొంతుసవరించుకుంది. కాకున్నా మేమేమన్నా మోసుకెళ్తామంట్రా? రైల్లో పడేస్తే అవేవస్తాయి! నీకెందుకదంతా! నే చూచుకుంటానుగా వాటి సంగతి! ఒరేయ్ రామిగా....!" బామ్మ ఉపన్యాసం ఆపి రామిగాడికేసి చూచింది. ఆవిడచూపులో వాడు ఎన్ని పేరగ్రాఫులు చదివాడో నాకైతే అర్థంకాలేదుగానీ, మరునిముషంలో, రెండు బూడిదగుమ్మడికాయలూ, పట్టుకుని, శంఖ. చక్రధరుడైన విష్టుమూర్తిలా సాక్షాత్కరించాడు రామిగాడు! గొడవంతా చూస్తున్న అమ్మ, నాన్నగారూ ఏవీ మాట్లాడలేదు! బామ్మకోపం వస్తే దూర్వాసుడిపోటో వేరే చూడక్ఖర్లేదని వాళ్లిద్దరికీ తెలుసు.

నేమాత్రం ఊరుకోలేకపోయాను. "బామ్మ, ఇవిగాని ఎవరేనా చూస్తే, చెవులకు తాటాకులు కడతారు.... నీపుణ్యం వుంటుంది.... అందులోనూ శలవులయింతర్వాత ట్రెయిన్‌లో. అందరూ మా కాలేజికుర్రాళ్లే వుంటారు...." నామాట పూర్తికాకముందే బామ్మ సింహగర్జన చేసింది.

"పిల్లపక్షివి. నీకేంతెలుసు సంసారాల్లో కష్టసుఖాలు! అన్నిటికీ నేనున్నాగా.... నువ్వూరుకో!" బామ్మచేతి అభయముద్ర చూచి ఇక నోరుమెదపలేకపోయాను. బండి కదిలింది.

బూడిదగుమ్మడికాయలను ఒక్కసారి కసిగా పరీక్షగా చూచాను.

గుండె ఝల్లుమంది! ఇవి మామూలు కాయలుకావు, సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుడి నామాలకాయలు! క్రితం ఏడాది పెరట్లో ఎలకలు చెట్లపాదులు త్రవ్వి వెయ్యటం వల్ల గుమ్మడికాయలు కాయలేదు. అది దేవుడిమహిమ అనే ఉద్దేశంతో బామ్మ ఈసంవత్సరం అన్నికాయలకూ, పసుపూ, సున్నం కలపి నామాలు పెట్టించింది! పిందెలకు ఎంతలేసి నామాలు పెట్టిందోగానీ, అవీ పెరిగిపెద్దవై, కాయంతా ఆక్రమించుకున్నాయి! ముచ్చటగా మూడేసి నామాలు, కాయలకు మూడువేపులా వున్నాయి!

"బామ్మా!"

"ఆ! ఏవిటీ నీగోల?"

సూట్‌కేసులోగానీ, హోల్డాల్‌లోగానీ అవి పట్టవు. పోనీ నీమూతబుట్టలో పెట్టుబామ్మా.... ఆకాయలు!" అన్నాను ఎట్టకేలకు నీళ్లునముల్తూ!

పూర్వం కబీర్‌దాస్ ఎంతో భక్తిపారవశ్యంలో అమోఘమైన ముక్క శలవిచ్చాడు." సప్తసముద్రాలనూ సిరాగానూ, సమస్త అరణ్యములలోని తరువులనూ కలము

గానూ, భూమ్యాకాశముల నంతటినీ కాగితంగానూ ఉపయోగించినా, నీగుణగానవర్ణనకు చాలవు!'' అని! అయితే అది దేవుడినిగురించి! బామ్మ ప్రయాణపుబుట్టను వర్ణించాలన్నా అంతేననిపిస్తుంది! అందులో మడిఊరగాయలు, కట్టుకునీధోవతులు, ప్రక్కనే వైద్యాలకు కావాలసిన సామానులు, పిల్లలకు ఆటవస్తువులూ, ఒకటేమిటి? వీటైతే ఒకరిద్దరు మనుష్యుల్నికూడా సర్దెయ్యకలదు! అందుకనీ అంత ధైర్యంగా అడగ్గలిగాను!

"ఛ. ఛ! ఇంత తెలివితక్కువేమిటే అమ్మాయ్ నీకు? అవివేస్తే బుట్టలో అడుగున ఉన్న మట్టికూజాలు రెండూ పగిలిపోవూ?''

ఉగ్రరూపందాల్చిన బామ్మ కంఠస్వరం ఖంగుమంది! బుట్టలో అడుగున రెండు మట్టికూజాలున్నాయనే నగ్న సత్యం నాకుతెలిసింది!

అసలే బామ్మతో ప్రయాణం! అందులోనూ బామ్మ మూతబుట్టతో! అదిచాలక, రెండు............ రెండు నామాల బూడిదగుమ్మడికాయలతో! బస్సులో సామాను చేరవెయ్యటానికి రూపాయిన్నర పుచ్చుకున్నారు కూలీలు! స్టేషన్లో కూలివాడికి సామాన్లు పురమాయించి, బస్సు దిగి వస్తున్న రామిగాడ్ని గుమ్మడికాయలు పట్టుకరావలసిందిగా, ముందుగానే బామ్మ చెప్పిపెట్టింది! స్టేషనంతా కోలాహలంగా వుంది! ట్రెయిన్‌కు సిగ్నల్ ఇచ్చారు కాబోలు! టైంకు స్టేషన్‌కు చేరుకోగలిగామని సంతోషం వేసిందో, లేదో, బామ్మ కేకతో అది కాస్తా ఎగిరిపోయింది!

ఒరేయ్! ఆబూడిదగుమ్మడికాయలు పట్టుకొస్తున్నావా? "బామ్మ'' దేవదత్తం "పూరించింది!

"ఇవిగోండి అమ్మగారూ! నేనంత మొద్దునా? ప్రాణం అయినా విడుస్తానుగానీ గుమ్మడికాయలు మర్చిపోతానా?'' అంటూ "పాంచజన్యం'' స్వరంలో, అవలీలగా చేతల్లో చూపాడు రామిగాడు! అంత హడావుడిలోనూ "బామ్మ-రామిగాడి'' సంవాదం విని, మా వేపూ, నామాల గుమ్మడికాయల వేపూ చూచి, ఓపిక ఉన్నవాళ్లు పెద్దగా, బలహీనులు చిరునవ్వులూ నవ్వుకున్నారు జనం!

గజేంద్రుడిని రక్షించటానికి పరుగున వచ్చిన విష్ణుమూర్తిలా, వచ్చేసింది ట్రెయిన్. ముందుగా ట్రెయిన్‌లోకి ఎక్కి, కూచోటానికి జాగా చూచుకున్నాం నేనూ, బామ్మా! తర్వాత సామాన్లు, కిటికీలోనుంచిఅంది పుచ్చుకున్నాను, గుమ్మడికాయలు నేను పడేస్తానేమోనని, బామ్మ స్వయంగా అందుకోటానికి సిద్ధపడింది! అమాంతం ఒకదానితర్వాత ఒకటి నా ఒళ్లోజారిపడి దొర్లి, ఎదురుగా కూర్చునిఉన్న బట్టతలాయన కాళ్ల చితగ్గొట్టాయి! నాచీరెఅంతా బూడిద! "నూగు" అంటుకున్నదని ఆయన గొడవమొదలుపెట్టాడు! తిన్నగాసర్ది చెప్పాను! ఎదురుగా కూర్చునివున్న కాలేజికుర్రాళ్లు ముసిముసినవ్వుల్తో ప్రాణాలు ఎగిరిపోయాయి!

"అసలింతకూ ఈకాయలేవిటి బామ్మగారూ? ఇలా వున్నాయి? ఆచారలేమిటి? ఎందాకా వీటిప్రయాణం? ఎందరికాళ్లు చితగ్గొట్టగలవు? ఇంతకూ ఏంచేస్తారు వీటితో?" ఇత్యాది ప్రశ్నపరంపరలు, కంపార్ట్‌మెంటు నలుమూలలనుంచీ మమ్మల్ని చుట్టుముట్టాయి!

సమాధానాల బాధ్యత బామ్మకు వదిలేసి నిర్లిప్తంగా కిటికీలోంచి బయటికి చూస్తూ కూర్చున్నాను!

బామ్మకు కవిత్వం వచ్చివుంటే "శతావధాని" బిరుదు సంపాదించుకునివుండేది! ఆగుమ్మడికాయలను దేవుడు ఎందుకు ఎలా సృష్టించాడన్నవిషయం దగ్గర్నుంచి, అవి మానవులకు వుపయోగించే వివిధ రకాలే కాకుండా, మేమిప్పుడు ఆకాయలతో ఎక్కడ ఏంచెయ్యబోతున్నామోకూడా, వివిధ ఉపమానాలతో, వ్యాఖ్యలతో, భంగిమలతో, ఎవరికి ఏప్రశ్నకు సమాధానం కావాలో ఇచ్చేసింది!

తొమ్మిదినెలలు, మోసి, కనిపెంచే పిల్లలనయినా, తల్లులు కాస్త బెర్తుమీద కూర్చోబెడతారుగానీ, బామ్మ ఆగుమ్మడికాయల్ని మాత్రం ఒళ్లోనే పెట్టుకుక్కూర్చుంది, ఫలితం ఆమెకాళ్లు రెండూ పట్టుకపోయాయి! ఈ అవస్థ చూస్తున్న పెద్దమనిషి, తనసామాను పక్కకుసర్ది, ఆరెండుకాయలూ పైబెర్త్‌మీద పెట్టాడు! ఇదంతా ఏమీ పట్టించుకోకుండా, జ్ఞానేంద్రియాలు పనిచేస్తున్నా, కళ్లు మూసుక నిద్ర అభినయించాను! ఒక్కోస్టేషన్లోనూ ఎవరోకొందరు కొత్తవాళ్లు ఎక్కటం, ఉచ్ఛస్థితిలో వున్న శనిగ్రహాల్లా పైబెర్త్ మీద వున్నకాయలకేసి చూడటం, "అవేమిటి? ఎవరివి?" అనటం వెంటనే, బామ్మ గొంతుసవరించుకుని వివరాలు చెప్పటం, ఈకార్యక్రమం ఉచ్ఛ్వాసనిశ్వాసలంతటి మామూలు అయిపోయింది పోనుపోను!

నిజంగానే నిద్రపట్టింది! హఠాత్తుగా ''ధనధన" పెద్ద శబ్దమయింది! ట్రెయిన్ ఆగినకుదుపు నేనే కాకుండా! కంపార్ట్‌మెంటులో ఉన్న అందరూ ! ఉలిక్కిపడ్డారు. సాయంత్రం గుంతకల్లుస్టేషన్‌లో ఎక్కిన "ఆవిడ" ఎంతగా భయపడిందో.... పాపం వెర్రికేక వేసి 'ఫిట్స

వచ్చి పడిపోయింది! ఇంతరాద్ధాంతానికీ, అస్టేషన్లో జనమూ, పక్కపెట్టెల్లోవాళ్లూ రావటంతో, నా నిద్రమత్తు పూర్తిగా వదిలి, శరీరం చల్లబడిపోయింది! తీరాచూస్తే, పైనుంచి ట్రెయిన్ కుదుపుకు కిందపడ్డ రెండునామాల గుమ్మడికాయలూ, ఒకటి పగులువారి నీళ్లు కారుతు, మరొకటి బుద్ధిగా బెర్త్‌కింద వున్నాయి!

"ఎవరివి?" అన్నారందరిలో ఎవరో!

"మావికావు!" అన్నాను చటుక్కున.... అతటితోనయినా పీడ వదలిపోతుందని!

"అయ్యో! పిచ్చిముదిరిపోయిందే! అయ్యో! అయ్యో! అవి మావేనండీ!" అంటూ బామ్మ పగులువారిన గుమ్మడికాయకేసి చూచి కళ్లనీళ్లు నింపుకుంది!

పాపం! నిక్షేపంలాటిపిల్ల! ఎప్పట్నుంచి బామ్మగారూ పిచ్చి?" అన్నాడో ప్రబుద్ధుడు నన్ను నఖశిఖ పర్యంతం పరీక్షగా చూస్తూ!

బామ్మ గుమ్మడికాయలను ఓవేపు సర్దిపెడుత్తూ.... అతనిమాట సరిగా వినలేదల్లేవుంది, "బెంగుళూరులో వీళ్ల అన్నయ్యా ఒదినా వున్నారునాయనా! అందాకా ఏ అవాంతరమూ లేకుండా చేరితే.... తర్వాత వాళ్లే చూచుకుంటారు దీనిపని....!" అంది గొణుగుతూ!

అది పగులువారిన గుమ్మడికాయకు సంబంధించిన "క్వశ్చెన్" అని నాకుతెలుసు! "ప్చ్! ఒంటరిగా పిచ్చివాళ్లను తీసుకెళ్లటం మహాఇబ్బంది!" అంటూ జాలిగా నాకేసిచూచి, దిగివెళ్లాడాయన! నిశ్చేష్టురాలినై కూర్చుండిపోయాను! భక్తుడికి భగవంతుడికిసాక్షాత్కారంలా బెంగుళూరుస్టేషన్ వచ్చింది!

ఇంట్లో అడుగుపెడుతూనే, కుశలప్రశ్నలకు బదులు, అన్నయ్య!

"ఇవేమిటే బామ్మా! మనఊరినుంచే పట్టుకొచ్చారేమిటీ?" అన్నాడు గుమ్మడికాయలకేసిచూస్తు ఆశ్చర్యాన్ని నరనరంలోనూ నింపుకుని!

అందాకా "టేప్‌రికార్డులా" ఆగుమ్మడికాయల కథాకమామిషూ చెబుతూన్న బామ్మకిక అవేమిటో" చెప్పే ఓపికలేక, ప్రయాణపుబడలికతో సోఫాలో కూలబడింది!

వాటినిగురించిన కథలూ, వాటికయిన చార్జీలూ, నాఅవస్థా అంతా వివరించి, నాకోపాన్ని వెళ్లగక్కేశాను నేను!

అన్నయ్యా ఒదినలు నవ్వాపుకోలేక పోయారు!

"అయినా బామ్మా! బెంగుళూరులో దొరకని కాయలంటూ ఉండవుగదా! అలాటిది నామాలగుమ్మడికాయలు.... లగేజీఛార్జీలు ఐదురూపాయిలుపెట్టి.... "అన్నయ్య నవ్వుతో ఇక మాట్లాడలేకపోయాడు!

పదిరోజులతర్వాత "వడియాల" సంరంభానికి ముహూ!ర్తం నిర్ణయించి బామ్మ, మిగిలిన ఒక్కగట్టిగుమ్మడికాయనూ పగులగొట్టించింది! శుభ్రంగా కుళ్లిపోయింది!

"హొరా!హొరా! వెంకటేశ్వరుడినామాలు పెట్టాము గదా! ఇదేం చిత్రమమ్మా! ఒకటి రైల్లో పగిలి పాడయితే, రెండోది ఊరికే పాడయిపోయిందేమిటీ?" అంది "దేవుడుకూడా మోసాలమనిషే" ననే ధోరణిలో!

"అక్కడా ఇక్కడా ప్రయాణంలో కొట్టుకుని లోపల పాడయివుంటుంది! మనం చూచుకోలేదు! పోతేపోయింది లేండి బామ్మగారూ!" అంది ఒదిన, ఒచ్చేనవ్వు ఆపుకోటానికి విఫలప్రయత్నంచేస్తు!

చెల్లాయి తిట్టుకున్న తిట్లన్నీ తగిలుంటాయి బామ్మా! "అంటూ జాలిగా బామ్మకేసి చూచి బయటికి వెళ్లిపోయాడు అన్నయ్య! నిజమేనేమో!

వాస్తవమ్ము నార్లవారి మాట

"ఆడుదాని సిగ్గు ఆజన్మసిద్ధమ్ము;
ఆడుదాని సిగ్గు ఆయుధమ్ము;
ఆడుదాని సిగ్గు ఆభరణమ్మురా!
వాస్తవమ్ము నార్లవారి మాట"

"నగలు లేవటంచు వగచెందుటే గాని
నగలవల్ల లేని సొగసు రాదు:
మగువ కేల నగలు మనసిచ్చు మగ డున్న?
వాస్తవమ్ము నార్లవారి మాట"

వి జ య ం

ఆంధ్ర మహిళా సభ

బెనారస్ హిందూవిశ్వవిద్యాలయ అడ్మిషన్ పరీక్షలకు మార్చి 61 లో వెళ్ళిన విద్యార్థినులలో ఉత్తీర్ణులైనవారు.

రెండవ తరగతి

1. కుమారి ఎ. రంగనాథన్ వేదప్రియ 2. కుమారి ఎ. రంగనాథన్ లావణ్య 3. కుమారి సి. ఏ. ఏ. రఫియాఅజీజ్
4. ,, కమలా రామమూర్తి 5. ,, లక్ష్మీశఠగోపన్ 6. ,, రామిలా యస్. పరేఖ్
7. ,, శ్యామలా కేశవన్ 8. ,, యస్. కళావతి 9. ,, ఊర్వసిభాటియా
10. కుమారి వసంతాగోపాలకృష్ణన్ 11. కుమారి ఇందుమతి

మూడవ తరగతి

1. కుమారి ఆమరజీత్ అనేజా 2. కుమారి అనూరాధపార్నందిరావు 3. కుమారి పి. చంద్రకళ
4. ,, జగన్నాథన్ కల్పకం 5. ,, కాంతిరాధాకృష్ణ 6. ,, పద్మినీవారియార్.
7. ,, ప్రమీలాఫ్రెడరిక్ 8. ,, పద్మలీలా వీరసింగం 9. ,, పార్థసారధి ఇందిర
10. ,, రమేష్‌కుమారీశర్మ 11. ,, రాధా వెంకటరామన్ 12. ,, ఆర్. త్యాగరాజన్ సుకన్య
13. రేఖా యశ్వంతరావ్ తూ(దూ)బే 14. రేవతీవేణుగోపాల్

ఆంధ్రా మెట్రిక్యులేషన్‌పరీక్షలలో–1961 మార్చిలో ఉత్తీర్ణులయినవారు.

మొదట తరగతి

1. కుమారి టి. శ్రద్ధాదేవి

రెండవ తరగతి

1. కుమారి యం. విజయలక్ష్మి 2. కుమారి కే. లీలారాణి
3. ,, యన్. విజయలక్ష్మి 4. ,, అరుణ

మదరాసు మెట్రిక్యులేషన్‌పరీక్షలో నెగ్గిన విద్యార్థిని

మూడవ తరగతి

1. కుమారి కే. ధనమావతి

జీవిక

శ్రీ యామజాల నరసింహమూర్తి

లక్ష్మికి మూడవసంవత్సరం వచ్చిన ఆరునెలలకి తండ్రి వెంకయ్య చనిపోయాడు. అప్పటికి అతని భార్య రత్తమ్మ ఏడుమాసాల గర్భిణి. భర్త చనిపోయిన మూడుమాసములకి పండంటి కొడుకు పుట్టాడు. అనిర్భాగ్యుడు తండ్రిని చూడడాన్కి పెట్టిపుట్టలేదు.

భర్త చనిపోయాడు. సంసారం గడిచేవిధానం కనపడలేదు. వెనుక ఆదుకోనేవారసలే లేరు. ఇక గత్యంతరంలేక రత్తమ్మ కూలిపనికి వెళ్ళేది. దానితోటే సంసారం అతికష్టంమీద నడిచేది...... కాలచక్రం తిరుగుతోంది. లక్ష్మికి యిప్పుడు అయిదవసంవత్సరం; బడిలో జేర్పించేయాడు. చదివిద్దామన్న ధ్యాస ఎవ్వరికి? తోడిపిల్లలు పలక, పుస్తకాలు పట్టుకుని బడికివెడుతూవుంటే లక్ష్మికికూడా చదువుకోవాలన్న ధ్యాస వుండేది. ఏమనుంటే యేంలాభం? ఆమెకాయోగ్యత లేదు. దేనికైనా పెట్టిపుట్టాలి. తిండికే గడవనపుడు చదువెందుకు? చదవాలన్న కోరిక వున్నా యింటిపరిస్థితులవల్ల లక్ష్మి చదువు మానవలసివచ్చింది. లక్ష్మికి లక్ష్మిప్రసన్నము లేదు; సరస్వతీ ప్రసన్నము లేదు. ఇంట్లో తల్లికి చేదోడువాదోడుగా వుండేది. ఆమెకు చేతనైనదల్లా తమ్ముణ్ణి ఆడించడమే.

లక్ష్మికి ఎనిమిదవపడు. ఒకరోజు రత్తమ్మ కూతుర్ని దగ్గరకు పిలిచి.

"అమ్మా! లక్ష్మి, నీవు రేపటినుంచి పెదరామయ్యగారింటికి వెళ్ళి వారిచంటబ్బాయిని, తమ్ముణ్ణి ఎత్తుకున్నట్లే ఎత్తుకోవాలమ్మా! వారిపిల్లలతో కలసి ఆడుకోవచ్చు నీవు. అన్నంకూడా వారే పెడతారు. పడుకోడాన్కి మనింటికి రామ్మా. నాచిట్టితల్లి నేనుచెప్పినట్లు వింటుందికదూ! అంది.

"మరి యిక్కడ తమ్ముణ్ణి ఎవరు ఆడిస్తారు? నీవు పొలం వెడితే యింటిగ్గర ఒక్కడూ వుండగలడా?" అంది లక్ష్మి.

"పోనీ, నాతోబాటు తమ్ముణ్ణి తీసుకెడతా" అన్నది రత్తమ్మ కూతురు తెలివికి ఆశ్చర్యపడుతు. ఒకవైపు పెదరామయ్యగారి మేడమీద వారిపిల్లలతో ఆడుకోవచ్చన్న సంతోషమొకటి, మరొకవైపుయింటి దగ్గర తమ్ముణ్ణి ఒక్కణ్ణీ వదలివెళ్ళాలిగదా, అన్న దిగులు లక్ష్మిలో ఆవరించాయి. విధాతనిర్ణయాన్కి తిరుగులేదు. లోకంలో మానవుడు తలచిన కోరికలన్నీ ఫలించవు.

ఆమరునాడు రత్తమ్మ కూతుర్ని వెంటబెట్టుకుని పెదరామయ్యగారింటికి వెళ్ళింది. పెదరామయ్యగారి రెండతస్థులమేడ. ఆపూరిలోకల్లా అదేపెద్దది. ఈయన బాగా ఆస్తిపరుడు. పెద్దలు సంపాదించి యీయన చేతిలో బెట్టారు. ఎంతసిరిసంపదలతో తులదూగితేనేమి, తను సుఖపడలేదు; ఎదుటివాళ్ళని సుఖపెట్టలేదు. ఇంటిపెత్తనమంతా భార్యశారదాంబదే. రామయ్యగారు నామమాత్రుడు పనిమనిషిని మార్చడం దగ్గరనుంచి. భూమిలోని రైతును మార్చడం కూడ భార్యసలహా లేనిదే ఏమీ చెయ్యలేదు.

వెళ్ళగానే లక్ష్మిచేత శారదాంబగార్కి నమస్కారం చేయించింది.

"శారదాంబగారు! మాలక్ష్మి యింకా చిన్నపిల్ల. అమాయకురాలు. పనులు చెప్పి చేయించుకోండి. తప్పుచేస్తే మన్నించండమ్మా. దానిబ్రతుకు అదిచూచుకుంటుందిగదా, అని మీ దగ్గర వుంచుతాన్నానమ్మా" అంది రత్తమ్మ శారదాంబగారితో. "వేరే చెప్పాలా! నాకుమాత్రం తెలియదు. అయినా యింట్లో పనులేముంటాయి. పిల్లవాణ్ణి ఎత్తుకోవడమే" అన్నది శారదాంబ.

వారిసంభాషణలనుబట్టి. వారిపిల్లవాణ్ణి ఎత్తుకోవడాన్కి కుదిరినానుకదా అని లక్ష్మి గ్రహించింది. తర్వాత రత్తమ్మ కూతురికి చెప్పింది. అన్నంపెట్టి, బట్టయిచ్చి నెలకు ఎనిమిదిరూపాయిలు యిస్తారని. పేణ్ణీళ్ళకు చనీళ్ళు సాయం.

లక్ష్మి తల్లితోబాటు తెల్లవారుఝామునవే లేచి ముఖం కడుక్కునేది. రత్తమ్మ నూనెలేని లక్ష్మి జుట్టుని ముఖంమీద పడకుండా దువ్వి కట్టేది. రోజూ యీవిధంగానన్నా, జడ అల్లుకుంటున్నాను గదా అని లక్ష్మి సంబరపడేది. అంతకు ముందు రోజూ తల దువ్వుకోవడమంటేనే ఎరుగదు. తైలసంస్కారంలేక తల పేలకు స్థావరంగా వుండేది. పండుగలకు, అమ్మవారి సంబరాలకుమాత్రం తల్లి నూనెరాసి తల దువ్వి జడవేసేది. లక్ష్మి కుట్టుమిషనుదగ్గర ఏరుకు వచ్చిన రంగురంగు గుడ్డపేలికల్ని కుచ్చుగా జడచివర కట్టుకునేది. వాటినే సిల్కురిబన్లులా చూచుకుని మురిసిపోయేది. అంబలే పాయసం!

ఉదయాన్నే పెదరామయ్యగారింటికి వెళ్ళేది. అప్పటికి శారదాంబగారు వారబ్బాయికిఉగ్గు పెడుతూ

వుండేవారు. ఉగ్గుపెట్టి పాలుయిచ్చి లక్ష్మికి యిచ్చేవారు పిల్లవాణ్ణి ఎత్తుకోవడాన్కి. దానితో లక్ష్మికార్యక్రమం ప్రారంభమయ్యేది. ఆ అబ్బాయి పడుకున్నపుడు తప్ప యితరసమయాల్లో, ఏడ్చినా ఏడ్వకపోయినా చంక దింపనిచ్చేవారుకారు. పిల్లవాడు ఏడాది లోపువాడైనా పుష్టిగా వుండడంవల్ల లక్ష్మివయస్సుకాపిల్లవాణ్ణి ఎత్తుకోవటం కష్టంగానే వుంది, ఏమైనా ఎత్తుకోవడం తప్పదుగా!

ఆయింట్లో పెద్దవారికన్నా పిల్లలకే లక్ష్మియందు ప్రేమాదరణలు హెచ్చు. వారేమి తిన్నా లక్ష్మికి పెట్టేవారు. గాజులు, రిబ్బన్లు, కొనుక్కుంటే లక్ష్మికి కూడా పిల్లలే యిచ్చేవారు. ఆపసిహృదయాలకు హెచ్చుతగ్గులు తెలియవు. తమతోబాటుగానే లక్ష్మిని చూచేవారు. వాళ్ళలో వాళ్ళు జడలల్లుకొనేవారు. వారిలో అంతస్థుల భేదాలులేవు. బొమ్మలపెండ్లిళ్ళలో ఒకరికొకరు వియ్యమందుకొనేవారు.

కాలం గడుస్తోంది; వయస్సు పెరుగుతోంది. లక్ష్మి జీవితంలో సు ంఎరుగదు. యుక్తవయస్సు వచ్చింది. లక్ష్మికి సహజమైన అందంవుంది. అయితేనేమి? దానికి తగిన సంస్కరణ లేక క్షీణించింది. యుక్తవయస్కురాలయ్యేటప్పటి కామె అందం చెట్టుచిగిర్చినట్లు చిగర్చింది. అందరిచూపులు లక్ష్మిమీదే. లక్ష్మిలో మార్పు వచ్చినా పనిలో మార్పురాలేదు. పిల్లల్ని ఎత్తుకోవటమే. శారదాంబగారి కడుపుచలవ మంచిది గాబట్టే, లక్ష్మి పనిలోనుంచి తొలగవలసినపని లేకపోయింది. ఆడువారికి తలంటి నీళ్ళుపోసేపనికూడా యిప్పుడు లక్ష్మి చేయవలసివస్తోంది. వారికి తలంటి నీళ్ళుపోసినాక తనూ నీళ్ళుపోసుకునేది. తలంటుకున్ననాడు లక్ష్మి మరీ అందంగా వుండేది. ఇతరులెవ్వరూ చూడకుండా అద్దంముందు నిలబడి తనఅందాన్ని చూచుకొని ఆశ్చర్యపడేది. కాలం గడుస్తున్నకొద్దీ లక్ష్మికి మనోవ్యధ మితిమీరింది.

జీవితంతోబాటు జీవనభారం హెచ్చింది. తమ్ముణ్ణి స్కూలులో చేర్పించింది. తల్లికి ఆరోగ్యం సరిగా వుండటంలేదు. జీవితంలో కష్టాలకేగాని సుఖాలకు ఆస్కారం లేదనుకొనేది పెదరామయ్యగారిచ్చే పదిహేను రూపాయిలతోటి మూడుజీవాలు జీవించాలి. ఇక వేరే గత్యంతరంలేదు. ఆయింటిలో పని మానెయ్యాలన్న తలంపు లక్ష్మికి లేనేలేదు. కాని పెదరామయ్యగారి మూడవపిల్లకి 'లక్ష్మి' అని నామకరణం చేసినప్పటి నుంచి లక్ష్మిని 'లచ్చి' అని పిలవడం ప్రారంభించారు. లక్ష్మి అభిమానం దెబ్బతింది. అప్పటినుంచీ వారింట్లో అయిష్టతతోనే పనిచేస్తోంది. తనయీడు పిల్లలుకూడ 'లచ్చి' అనే పిలుస్తున్నారు. వయసుతోబాటు మన భావాలుకూడా మారాయి. ఆదరణ సన్నగిల్లింది ఎలాగైనా పనిమానెయ్యాలని దృఢ నిశ్చయురాలైనది.

"వెనక్కి వెడితే నుయ్యి ముందుకువెడితే గొయ్యి' తన అందం తనకే అపకారం తలపెట్ట మొదలిడింది. ఆమెలోని చైతన్యం అణుగంటింది. చీకటి తర్వాత వెలుగు, కష్టాల తర్వాత సుఖమన్నది తనకున్నదా, లేదాఅని వాపోయేది. అదే తరుణంలో "వుమెన్స వెల్‌ఫేర్ సెంటరుకి ఆర్గనైజరుగా పనిచేస్తున్న శారదాంబగారి అక్కకూతురు ఆవూరు రావడం, దైవికంగా తటస్థించింది. ఆమెపేరు లలిత. పేరుకు తగ్గట్టు ఆమె లాలిత్యము వుట్టిపడుతుంది. లక్ష్మిని చూడ్డంతోటే ఆమెలో ఒకవిధమైన జాలి. ప్రేమ పుట్టుకొచ్చాయి. దానికి కారణం ఆమెయొక్క ఉద్యోగ ధర్మమే! లక్ష్మియొక్క జీవితగాథను సంపూర్ణంగా తెల్సుకుంది. వెల్‌ఫేర్ సెంటరుయొక్క ఆశయాలను లక్ష్మికి తెల్పి, సెంటరులో జేరి స్వేచ్ఛా జీవితాన్ని అలవర్చుకోమన్నది. లక్ష్మికి ఆనందం అవధుల్ని దాటింది. గమ్యానికి సరియైనమార్గం దొరికింది కదా అని మురిసిపోయింది. ఈ విషయాన్ని తల్లికిచెప్పి. ఆ సెంటరులో చేరడాన్కి అనుమతి కోరింది. ఏ తల్లి కాదంటుంది?

లక్ష్మి లలితమ్మతో వెల్‌ఫేర్ సెంటరుకి వెళ్ళింది. అచ్చట కుట్టుపని నేర్చుకొనడాన్కి లలితమ్మ ఏర్పాట్లు చేసింది. తరువాత లక్ష్మి తమ్ముణ్ణీ తల్లిని తనతోబాటు ఆవూరు తీసుకువచ్చింది. అంతవరకూ, పెదరామయ్యగారు శారదాందగారు చూపిన ప్రేమాదరణాలకు కృతజ్ఞత తెల్పింది.

లక్ష్మికి కుట్టుపనిలో మంచినేర్పు కలిగింది. ఇప్పుడు నెలకు నలభైయైదు రూపాయలదాకా సంపాదించ కల్గుతోంది. వారికి ఏ లోటులేదు. నిశాంధకారంలోనున్న తనకు ఆశాజ్యోతిలా కనబడి బ్రతుకు తెరవు చూపిన లలితమ్మను తను జన్మలో మరువలేను, అంటుంది లక్ష్మి.

రత్తమ్మకి ధారుఢ్యం తగ్గింది. లక్ష్మి తమ్ముడు స్కూలుఫైనలు చదువుచున్నాడు. ఎప్పుడైనా రత్తమ్మ కూతురితో "అమ్మా! లక్ష్మి! నిన్ను ఒకింటిదాన్ని చేయలేకపోయానమ్మా" అనిఅంటే "అమ్మా, ముందు తమ్ముడు తన బ్రతుకుతెరవు చూచుకుని ఒకయింటివాడవాలమ్మా" అంటుంది లక్ష్మి ఆనందంతో.

వార్తావళి

మదరాసు ఉన్నతన్యాయస్థానంలో ముఖ్యన్యాయాధిపతిగ నున్న శ్రీ పి. వి. రాజమన్నారుగారు తమయుద్యోగమునుండి విరమించుచున్నందున, వారి స్థానంలో శ్రీ యస్. రామచంద్ర అయ్యరుగారిని ప్రధానన్యాయాధికారిగ ఐక్యభారతాధ్యక్షులు నియమించారు. శ్రీ అయ్యరుగారు 10–5–1961–న, పదవిని స్వీకరిస్తూ, శ్రీ రాజమన్నారుగారి భవనమున రాజభక్తి ప్రమాణం చేశారు.

సింహళరాష్ట్ర మాజీప్రధాని అయిన శ్రీ భండార్కే నాయకేను ఆయనమందిరంలోనే 25–9–1959 న, హత్యచేసిన బౌద్ధమతభిక్కులు—శ్రీ బుద్ధరక్షిత తేరో (కేలనీయా బుద్ధదేవాలయంలో ముఖ్యోద్యోగి), శ్రీ సోమరామ తేరో, హెచ్. పి. జయవార్ధనే–అనే ముగ్గురికీ సిలోను సుప్రీంకోర్టు మరణదండన విధించింది. అందులో మొదటిఅతణ్ణి జూన్ 20 తేదీన, రెండవఅతణ్ణి 21–న, మూడవఅతణ్ణి 22–న ఉరితీయాల్సని తీర్మానించబడింది.

సుప్రసిద్ధ కర్నాటక సంగీతవిద్వాంసుడు, కీర్తనల రచయిత– సంగీతకళానిధి, సంగీతశాస్త్రరత్న, సంగీతశాస్త్ర విశారద, సరసగానశిరోమణి, సంగీతకళాకోవిద, మున్నగు బిరుదాలచే గౌరవింపబడిన యావద్భారత పూజ్యుడును, అధ్యక్షుల బహూకృతులచే సమ్మానితుడును, అడయారు కళాక్షేత్రంలో సంగీత విద్యా బోధకుడును అయిన మైసూరు వాసుదేవాచార్ 17–5–1961 రాత్రి దివంగతులయినారు. వారి మృతివల్ల వారు ఉపాసిస్తూవచ్చిన లలితకళయగు సంగీతానికి తీరనిలోటు సంభవించింది.

ఇతడు 96 సం॥రములు జీవించిన పూర్ణ పురుషాయుపజీవి. మరణసమయమున ఈయన ఏకైక పుత్రుడు సమీపమున ఉండెను. ఈయన నిర్యాణ వార్త వినగానే, కళాక్షేత్రాధ్యక్షురాలు శ్రీమతి రుక్మిణీదేవి వెళ్లి ఆయన భౌతికశరీరాన్ని దర్శించి, తన తుదిగౌరవము చూపినది. శ్రీ రాజమన్నారు మున్నగు ప్రముఖులు విచారసందేశాలు పంపి తమసానుభూతిని తెలిపారు.

ఈసం॥రం మేనెల 6 తారీఖునుండి కీ॥ శే॥ శ్రీ రవీంద్ర నాథ ఠాగోరుగారియొక్కయు, కీ॥ శే॥ శ్రీ మోతీలాలు నెహ్రూగారియొక్కయు శతవార్షికోత్సవాలు— మనదేశంలో ఆసేతుశీతాచలపర్యంతమేగాక, ఖండఖండాంతరాలలో మహావైభవంతో జరిగాయి. ఆయా ప్రదేశాలలోని ప్రభుత్వాలు, గొప్ప గొప్ప పదవులందున్న ప్రముఖులు, ప్రజానాయకులు ఆవుత్సవాల్లో పాల్గొనటం ముఖ్యంగా గమనింపదగ్గ విషయం.

ఈ నెలలో మన భారతదేశాన్ని సందర్శించినవారిలో ముఖ్యంగా పేర్కొనదగినవాడు అమెరికా ఉపాధ్యక్షుడయిన శ్రీ లిండన్ జాన్సను ఆయన సతీమణి. ఆదంపతులు అధ్యక్షుని, ప్రధానిని, ఉపాధ్యక్షుని సందర్శించి, ప్రకృత ప్రపంచ విషయాల్నిగూర్చిన్నీ, ముఖ్యంగా భారతదేశ అభివృద్ధిప్రణాళికల నిర్వహణకు కావలసిన ఆర్థికాది సహాయసంపత్తులనుగూర్చిన్నీ విపులంగా సంభాషించారు. జాన్సనుగారు (మనప్రధాని) నెహ్రూగారికి శ్రీ కెన్నడీ (అమెరికాఅధ్యక్షుడు) పంపిన లేఖను చేర్చాడు. అందులో మనకు అమెరికా చేయదగినంత సాహాయ్యాన్ని చేయగలదని శ్రీ కెన్నెడీ వివరించాడని తెలుస్తున్నది. శ్రీ జాన్సను— దేశాభ్యుదయానికై చేస్తున్న ప్రభుత్వకృషికి తన హర్షం తెలుపుతూ, ముందుముందు ఇంకా చేయదగిన కార్యాలనుగూర్చి సూచించాడు. స్వయంగా ఢిల్లీపరిసరాల్లో ఉండే కొన్నిగ్రామాలకు వెళ్లి అక్కడి గ్రామీణజనాన్ని కలుసుకొని సంభాషించాడు. భార్యతోకూడా శ్రీ జాన్సను రాజఘాటుకు వెళ్లి జాతిపిత సమాధికి జోహారులు అర్పించాడు. ఆగ్రా మున్నగు చూడదగిన చారిత్రకప్రదేశాలు చూచాడు. భారతదేశయాత్ర పూర్తి అయినతరువాత, జాన్సనుదంపతులు పాకిస్థాను సందర్శింపనున్నారు.

లోకసభ— రాజ్యసభ— ల సభ్యులందరు, ఒకటిగా లోకసభాధ్యక్షుని అధ్యక్షతక్రింద సమావేశం అయి, వరకట్నాల నిషేధచట్టాన్నిగూర్చి రెండు మూడు దినాలు తీవ్రవాదోపవాదాలతో చర్చించి తుదకు అంగీకరించారు. ఐకకంఠ్యంగా అంగీకరించబడిన యీశాసనం అధ్యక్షునిసంతకం కాగానే దేశంలో శీఘ్రంగా అములుకు రాగలదు.

రాష్ట్ర సంఘసంక్షేమ సలహాసంఘం, స్త్రీల సంక్షేమశాఖ, గ్రామాభ్యుదయ ఉద్యోగివర్గానికి చెందిన గ్రామసేవికల సమూహం, సాంఘిక స్త్రీవిద్యా సంస్థాపకులసమితి మొదలయినవి మదరాసు మహిళా

సంక్షేమశాఖతో ఒకటిగాచేరి, పునః స్థాపితమయి, 1961 జూన్ 1 తారీఖునుండి పనిప్రారంభిస్తుంది. మహిళా సంక్షేమసంఘానికి ఇంతవరకు డైరెక్టరుగాఉన్నవారే, 'స్త్రీజన కార్యక్రమాధికారిణి అనే పేరితో ఈ నూతన సంస్థను పరిశీలిస్తుంది. ఈవుద్యోగియే, తన పదవిని అనుసరించి, రాష్ట్రసంఘ సంక్షేమసమితికూడ, కార్యదర్శినిగా పనిచేస్తుంది. ఈమహాసంస్థ కార్యాలు ముమ్ముందు తెలియగలవు. —

గ్రంథ సమీక్ష

1. ఆధునిక కవుల చరిత్ర (౧వభాగం)— కర్త: శ్రీ కోగంటి దుర్గా మల్లికార్జునరావు, భారతీసమితి: పామర్రు: కృష్ణాజిల్లా. వెల 75 న.పై.

క్రౌనుసైజులో 48 పుటలు గల యీగ్రంథంలో పేర్కొనబడ్డ 15 మంది కవులలో పెక్కురు విద్వాన్ పట్టభద్రులై పాఠశాలలలో ఆంధ్రపండితపదవులలో ఉన్నవారు. నిప్పచ్చరంతో దోగుచు, అందతుకుల బ్రతుకులు సాగిస్తూఉన్న యీపండితకవులు సారస్వతాభిమానంతో ఏవోకృతులు వ్రాసినా, అవి ప్రచురించే ఆర్థికోపపత్తులు లేనివారు కావటంచేత, వారిపేరుప్రతిష్ఠలు పైకిరాక, పాఠశాలల పరిధివరకే నిలిచిపోవటం గమనింపతగింది. అట్టివారి సంగ్రహచరిత్రలు సంతరించి శ్రీరావుగారు ఈవిధంగా తెలుగు పలుకుల జవరాలికి ఉపాయనంగా సమర్పించటం ఎంతయినా మెచ్చదగిందే. కాని చరిత్ర— అన్నప్పుడు అస్పష్టముగా గాక, యింకకొంత వివరంగా ఉండటం మంచిదేమో!— గ్రంథకర్త కవులచరిత్రమని చెబుతూ— కేవలం గ్రామాధికారులుగా కీర్తినార్జించినవారిని, తదితరులను గూర్చి యీగ్రంథంలో చేర్చటంలో వారి ఉద్దేశం ఏమో బోధపడటంలేదు. ఇందులో పేర్కొనబడ్డ పండితకవులేకాక, లబ్ధప్రతిష్ఠులై చరిత్రకెక్కని గొప్పకవులనుగూర్చికూడ శ్రీరావుగారు వ్రాయటం సమంజసం.

2. ఆర్యవాణి: కర్త— వైద్యవిద్వాన్, సత్కవి శ్రీనారు నాగనార్య, నాగవరం, వయా, కోడూరు, కడపజిల్లా— వెల 0—6—0. క్రౌనుసైజులో 76 పుటల గ్రంథం.

ఇందులో.— ప్రార్థనాదికం, నైతికం, మతం, సాంఘికం, రాజకీయం, జిజ్ఞాస, వివిధవిషయములు అను శీర్షికలతో ఏడువిభాగమున్నవి. మొత్తంమీద 270 తేటగీతాలు గలవు. కుంటుగంటులు లేనినడకతో— లలితశబ్దముల పోహణితో— సరళమైన ధారతో— ఇందలిపద్యములు రసతుందిలములయి పాఠకునకు మనస్సున నాటుకొను పాటవముగల భావములుగలవి. 'కల్యాణోదంత' మను తమపీఠికలో కీ శే. శ్రీజనమంచి శేషాద్రిశర్మగారు తెలిపిన యభిప్రాయములు అక్షరశః సత్యసమ్మతములు. మచ్చునకుఁ గొన్నిపద్యములు:—

"కులట యెఱుఁగఁగలదె కులసతిమర్యాద,
పిశునుఁ డెఱుఁగఁగలఁడె పేదబాధ,
చవట యెఱుఁగఁగలఁడె శాస్త్రజ్ఞు విజ్ఞత,
నల్పుఁ డెఱుఁగఁగలఁడె యధికుశక్తి"

"దైవకృప కింత వర్ణభేదమ్ము లేదు,
తపనునెండకు జాతిభేదమ్ము లేదు,
తెమ్మెరకు స్పర్శఁ గులవిభేదమ్ము లేను,
సమత యనునది సృష్టినైజమ్ము సుమ్ము"

"కూటికిని గుడ్డకును వాచి కోవిదాళి
యాత్మదేశాన నూరుపేరడఁగి చావ,
నన్యదేశస్థు, పండితమ్మన్యు నొకని
గౌరవించుట యాంధ్రుల కర్మమమ్మ!"

స్వీకారము

శ్రీ పార్థసారధిశతకం: శ్రీ మునిరత్న ప్రణీతము.
తెలుఁగుతల్లి— పిల 0—12—0
తిలోత్తమ—,. 1 రూ 25 న.పై
తిలోత్తమాసాహసికము—,, 1 రూపాయ.—

ఈమూడుకృతులుగూడ— శ్రీ నాగనార్య విరచితములే.

'ఆంధ్ర మహిళ'

(ఆంధ్ర మహిళాలోకాభ్యుదయ మాసపత్రిక)

వ్యవస్థాపకురాలు :

శ్రీమతి దుర్గాబాయిదేశ్‌ముఖ్.

విడి పత్రిక—37 నయాపైసాలు   ప్రత్యేక వార్షిక సంచికతో కలిసి

సం॥ చందా - రూ. 6-00.

పంచాయతీ సంస్థలకు, సంక్షేమ సంఘాలకు, పౌరజన గ్రంథాలయాలకు పాఠశాలా పుస్తక భాండాగారాలకు సగము చందా సం॥ ౧॥ కి రూ. 3-00 లు.

పత్రికా విక్రయసంస్థల యేజంట్లకు

1. 'ఆంధ్ర మహిళ' ఆరింటికంటె తక్కువ ప్రతులకు ఇచ్చే ఆర్డర్లు గమనింపబడవు.
2. పత్రికకు 1 కి 12 న. పైసాలు కమీషను ఇవ్వబడును. పోస్టేజి మేమే భరింతుము.
3. విక్రయంకాని సంచికలు వాపసు తీసికోబడవు.
4. ప్రతినెల "ఆంధ్ర మహిళ" ఎన్నిప్రతులు కావలెనో సూచిస్తూ. అసలుక్రయంలో కమీషను మొత్తం మినహాయించుకొని, తక్కిన మొత్తంతో వచ్చే ఆర్డర్లు అంగీకరింప బడును.
5. ప్రత్యేక వార్షిక సంచిక ప్రతి 1. కి రూ. 2 లు, అయినా, యేజంట్లకు రూ. 1. 50 కే, (అనగా 25. కమీషన్ మినహాయింపుతో) ఇవ్వబడుతుంది.

ఆంధ్రమహిళ

ప్రకటన రేట్లు

సామాన్యమైన పుట 1 కి. రూ 60. లు,

అట్టకాగితం 2 వ పుట, 3. వ పుట (ఒకేరంగుతో) రూ 80 లు.

4. వ పుట (ఒకేరంగుతో) రూ 100 లు.

కొయ్య దిమ్మెలుగల బ్లాకులు అంగీకరించ బడును. ప్రకటనలు. బ్లాకులు పత్రిక వెలువడే తారీఖునకు 10 దినములు ముందే మాకు చేరాలి.

మేనేజరు,
ఆంధ్రమహిళ
7 ఎ. రోజరీచర్చిరోడ్డు,
మైలాపూరు—మద్రాసు 4.

Printed at Andhra Mahila Press, 7/A, Rosary Church Road, Published and Owned by Andhra Mahila Sabha, Madras. Editor - Secretary, Andhra Mahila Sabha.